06 . 08. 2025

# వెలుతురు

VELTHURU TELUGU DAILY

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 70 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## బీసీ రిజర్వేషన్ల పోరుకు ఢిల్లీకి చేరిన మంత్రి కొండా సురేఖ

- సురేఖ నేతృత్వంలో పెద్ద ఎత్తున హస్తినాకొచ్చిన ఓరుగల్లు బీసీలు
- బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటమేనని స్పష్టీకరణ

**ఢిల్లీ వెలుతురు ఆగస్టు 05:**



బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధనకి జరుగుతున్న పోరాటానికి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి చేరుకున్నారు. కాగా, మంత్రి సురేఖ నేతృత్వంలో పెద్ద ఎత్తున ఓరుగల్లుకు చెందిన బీసీలు దేశ రాజధాని హస్తినాకు

## తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ

- రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?
- ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్
- తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ,ఆగస్టు5 (వెలుతురు):** తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసంది. దీనిపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం



## బిఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

- అన్ని విషయాలు అసెంబ్లీలో పెట్టి చర్చిస్తాం
- బుకాయింపు రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరు
- మంత్రి పొంగులేటి ఘాటు హెచ్చరిక

**ఖమ్మం,ఆగస్టు 5( వెలుతురు):** కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతికి ఈ ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు. పిసి ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బిఆర్ఎస్ నేతలు జనంలోకి వస్తారని పేర్కొన్నారు. డబ్బు తీసుకుని బిఆర్ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని పొంగులేటి స్పష్టం చేశారు.

## రాజ్యసభలో సిఐఎస్ఎఫ్ సిబ్బంది రాక

- అధికార పార్టీ తీరుపై మండిపడ్డ సభ్యులు
- గందరగోళం మధ్య తొలుత వాయిదా
- అమిత్ షా కనుసన్నల్లో నడుస్తోందన్న ఖర్గే



**న్యూఢిల్లీ,ఆగస్టు 5( వెలుతురు):** రాజ్యసభ జరుగుతున్న తీరుపై విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇవిఎంలపై విశ్వసనీయత పోయింది

బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరపండి

బీహార్‌తో దీనిని ప్రారంభించండి

కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీలో బిఆర్ఎస్ డిమాండ్



## ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం

చేతల ప్రభుత్వమని చేసి చూపుతున్నాం

ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

## ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు

- ధరాలి గ్రామంపై విరుచుకుపడ్డ వరద
- జలప్రవాహానికి నలుగురు మృతి
- వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు
- సిఎం పుష్కర్ సింగ్ ధామితో ప్రధాని, హోంమంత్రి ఆరా



**డెహ్రాడూన్,ఆగస్టు 5( వెలుతురు):** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. ఇక్కడి ధరాలీ గ్రామంపై జలప్రవాహం విరుచుకుపడింది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు సమాచారం. దాదాపు 50 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని, 20-25 హోటళ్లు, నివాసాలు కొట్టుకుపోయి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటు-న్నారు. దీనికి

## కాళేశ్వరంపై సిబిఐ విచారణను పట్టించుకోని కాంగ్రెస్

## కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

- కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం
- తుమ్మడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్
- ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టి పారేసిన హరీష్ రావు

**హైదరాబాద్,ఆగస్టు5 ( వెలుతురు):**



కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి రాజకీయ కక్షలు సాధించేందుకే

## దేశానికి ఆదర్శంగా పి-4 కార్యక్రమం

- పేదరిక నిర్మూలనలో అతిపెద్ద ముందడుగు
- సాయం కోసం ఎవ్వరినీ బలవంతం చేయొద్దు
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచన



**అమరావతి,ఆగస్టు 5(వెలుతురు):** పేదరిక నిర్మూలనకు రాష్ట్రంలో చేపట్టిన పీ-4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమని చెప్పారు. సచివాలయంలో పీ-4 కార్యక్రమంపై మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమాన్ని ఈ నెల



## బిఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ–, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు– జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

## బీసీ రిజర్వేషన్ల పోరుకు ఢిల్లీకి చేరిన మంత్రి కొండా సురేఖ

చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... బీసీలకు రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటమేన డిమాండ్ చేశారు. బుధవారం బీసీ రిజర్వేషన్ల సాధనకై జంతర్‌మంతర్‌లో ధర్నా జరగనున్న నేపథ్యంలో... రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల నాయకులు ఢిల్లీకి చేరకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు – విద్యా, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరుతూ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఢిల్లీ జంతర్‌మంతర్‌లో బుధవారం మహాధర్నా చేపట్టనున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణలో సాగుతున్న సమయంలో తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కుల గణన చేపడతామని హామీ ఇవ్వగా, ఆయన ఆశయం నేరవేర్చేందుకు తాము పోరాటం చేస్తున్నామని అన్నారు. రిజర్వేషన్లు సాధించేవరకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ సర్కారు మీద తాము పోరాటం చేస్తామన్నారు.

## తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ

ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసు కోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్ష రాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు రాష్ట్రాల్లోస్థానిక వ్యవహారం పలు విధాలుగా ఉందని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. పలు రాష్ట్రాల్లో స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని సింఘ్వీ కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

## ఇవిఎంలపై విశ్వసనీయత పోయింది




**న్యూఢిల్లీ,ఆగస్ట్5( వెలుతురు):**



భారతదేశంలో ఇకపైన జరిగే ప్రతి ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు . బ్యాలెట్ విధానాన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేటీఆర్ కోరారు. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ నేతల బృందం కేటీఆర్ నేతృత్వంలో ఈసీ అధికారులతో సమావేశం అయింది. దేశంలో ఎన్నికల వ్యవస్థ, నూతన సంస్కరణలు, ఎన్నికల నియమావళి వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగానే టిఆర్ఎస్ పార్టీని సమావేశానికి ఆహ్వానించింది. కేంద్ర ఎన్నికల సంఘంతో జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ బృందం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేసింది.. భారత్ లో ఈవీఎంల ద్వారా జరుగుతున్న ఎన్నికల పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో, ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. నవంబర్ లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు– కేటీ–ఆర్ తెలిపారు. అంతేకాదు ఎన్నికలు వస్తే చాలు రాజకీయ పార్టీలు అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్నాయని, వాటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోతే చర్యలు కూడా తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని బిఆర్ఎస్ కోరింది. మరోపక్క బీహార్ లో జరిగిన ఓట్ల జాబితా సమగ్ర సర్వేపై కూడా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించినట్టు– తెలిపారు. ముఖ్యంగా ఓట్లు– తొలగించేటటువంటి ప్రక్రియను బూత్ స్థాయి నుంచి అన్ని రాజకీయ పార్టీలను అఖిలపక్షంగా ఏర్పాటు– చేసి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనర్హుడికి ఒక ఓటు– వచ్చినా సరే, ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు– కోల్పో వద్దన్నారు కేటీ–ఆర్. ఎన్నికల గుర్తులు నుంచి తమ పార్టీ సింబల్ అయిన కార్ గుర్తును పోలి ఉన్న గుర్తులను తక్షణమే తొలగించాలని.. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో పోలివున్న గుర్తులవల్ల తమ పార్టీ అభ్యర్థులు నష్టపోయారని కేటీఆర్ గుర్తు చేశారు..

## రాజ్యసభలో సిఐఎస్ఎఫ్ సిబ్బంది రాక

కేవలం అమిత్ షా కనుసన్నల్లో సభను నడుపుతున్నారని మండిపడ్డారు. మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్ ఉభయసభల్లోనూ ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహిస్తుండడం, ప్రతిపక్షాల గొంతులను అణచివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతకు ముందు ఛైర్మన్ స్థానంలో ఉన్నవారు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడం కూడా సమావేశాల్లో భాగమే అని భావించేవార న్నారు. కానీ ప్రస్తుతం సభల్లో మాట్లాడడానికి కూడా అవకా శం ఇవ్వకుండా తమ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నా రంటూ మండిపడ్డారు. హోంమంత్రి అమిత్‌షా సూచనల ప్రకారం సభలో నడుచుకుంటున్నారని.. అసలు సభను నడిపిస్తున్నది మీరా లేక అమిత్ షా నా? అని డిప్యూటీ– ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌ను ఖర్గే ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలపై హరివంశ్ నారాయణ్ మాట్లాడుతూ.. కాం గ్రెస్ అధ్యక్షుడు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపిం చారు. మరోవైపు సీఐఎస్ఎఫ్ సిబ్బందిని సభలోకి తీసుకువ చ్చారని.. వారు ప్రతిపక్ష నేతలను తమ ప్రజాస్వామ్య హక్కు లు వినియోగించు కోకుండా నిరోధిస్తున్నా రని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేతలు రాజ్యసభలో గందరగోళం సృష్టించారు. వారి వాదనను హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తోసిపుచ్చారు. ప్రతిపక్ష నేతలు సభను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. రాజ్యసభలో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోప ణలపై కేంద్రమంత్రి జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు ఎలా వ్యవహరిం చాలనే విషయాన్ని తాను చాలాసార్లు ఈ వ్యక్తులకు చెప్పిన ప్పటికీ వారు తమ తీరు మార్చుకోవట్లేదని మండిపడ్డారు. తాను దాదాపు 40 ఏళ్లకు పైగా ప్రతిపక్షంలో ఉన్నానని.. ప్రతిపక్ష స్థానాల్లో ఉన్న నేతలు ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవాలంటే తన దగ్గర ట్యూషన్ చెప్పించుకోవాలని విపక్ష నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎందుకంటే వారు ఆ స్థానంలో కేవలం పదేళ్లు మాత్రమే ఉన్నారని మరో 40 ఏళ్లు అక్కడే ఉండాలి కాబట్టి ఇటువంటి విషయాలు నేర్చుకోవాలని చురకలు అంటించారు.

# ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు

సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కుంభవృష్టి కారణంగా ఎగువ ప్రాంతమైన ఖీర్‌గఢ్ నుంచి మెరుపు వరదలు సంభవించి నట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఎస్‌డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భారత సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఐటీబీపీ బృందాలు ఘటనా స్థలానికి బయల్దేరి రంగంలోకి దిగినట్లు– సమాచారం. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ దిగ్భ్రాం÷–రతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు– వెల్లడించారు. ఉత్తరకాశీ ప్రాంతంలోని ధరాలీలో కుండపోత వర్షాల వల్ల భారీ నష్టం జరిగిందనే వార్త చాలా బాధాకరమన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికార బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యల్లో నిమగ్నమై పనిచేస్తున్నాయని తెలిపారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నట్లు– తెలిపారు. బాధిత ప్రజలకు సాధ్యమైనంతగా అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. అందరూ సురక్షితంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు– తెలిపారు. మరోవైపు.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సీఎం ధామీకి ఫోన్ చేసి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్రం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ధరాలీ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రధాని మోదీ సంఘీభావం ప్రకటించారు. ముఖ్యమంత్రి పుష్కర్ ధామీతో మాట్లాడి వివరాలు ఆరా తీసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో సహాయ బృందాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలీగ్రామం మెరుపు వరదలకు పూర్తిగా కొట్టుకు పోయింది. సముద్రం మీద పడిందా అన్న స్థాయిలో మేఘం వర్షించింది. దీంతో నీరు, అక్కడున్న మట్టి కలిసి భారీ ఎత్తున బురద వరద ధరాలిని కప్పేసింది. దీంతో ఇప్పుడు ఆ ప్రదేశం మరు భూమిని తలపిస్తోంది. చార్‌ధామ్ యాత్రికులు ఎక్కువగా ఈ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. యాపిల్స్‌కు ప్రసిద్ధిగాంచిన ఉత్తరాఖండ్‌లోని హర్సిల్ లోయ ఇక్కడకు కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఉత్తరాఖండ్‌లో మారుమూల ఉన్న అత్యంత రమ్యమైన ప్రదేశాల్లో ఒకటి. దీని సమీపం నుంచే భాగీరథి నది ప్రవహిస్తోంది. రిషికేశ్ నుంచి బయల్దేరి చంబా, ఉత్తరకాశీ, హర్సిల్ మీదుగా ఇక్కడికి వెళ్లవచ్చు. సముద్రమట్టానికి దాదాపు 2,680 మీటర్ల ఎత్తున ఈ ప్రదేశం ఉంది. ఇక్కడి నుంచి గంగోత్రి ధామ్ కేవలం 20 కిలోమీటర్ల దూరం. గ్రామం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతుంది. చార్‌ధామ్ సహా ఇతర తీర్థయాత్రల సీజన్‌లో ధరాలీ గ్రామానికి సందర్శకులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో లాడ్జిలు, అతిథి గృహాలున్నాయి. తక్కువ ధరలకే వసతి లభిస్తుండటంతో.. యాత్రికులు వీటి వైపు మొగ్గుచూపుతారు. ఇక్కడి నుంచి 32 కిలోమీటర్ల దూరంలో నీలాంగ్ లోయ ఉంది. భారత్–టిబెట్ మధ్య వ్యాపారం జరిగే పాత మార్గం ఇక్కడి నుంచి వెళుతుంది. ఇక్కడ రాత్రిళ్లు బస చేయడానికి అనుమతి లేదు. ఈ ప్రదేశాలను వీక్షించాలన్నా అటవీశాఖ అనుమతి ఉండాలి. ఇక ధరాలీ సమీపంలోని హర్సిల్ లోయలో భారీ విస్తీర్ణంలో యాపిల్ తోటలున్నాయి. చార్‌ధామ్ యాత్రికులు గంగోత్రికి వెళ్లే సమయంలో ఇక్కడ ఉండేందుకు ఇష్టపడతారు. కేదార్ తాల్ ప్రదేశానికి టెక్కింగ్‌కు వెళ్లేవారికి ఈ ప్రాంతం బేస్‌క్యాంప్‌గా ఉంటుంది. ధరాలీ గ్రామం సమీపంలోని ఖీర్‌గఢ్ నదీ పరివాహక ప్రదేశంలో భారీ వర్షం కారణంగా నీరు నిలిచింది. ఇది ఒక్కసారిగా ధరాలీ మార్కెట్ ప్రదేశంపై విరుచుకుపడింది. ఆగస్టు 10వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. తాజాగా చోటు–చేసుకున్న మెరుపు వరదల్లో 20 నుంచి 25 హోటళ్లు, హోమ్‌స్టేలు కొట్టు–కుపోయాయి. అతి తక్కువ సమయంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం నమోదు కావడాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ముఖ్యంగా గంటలోపు 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో 10 సెంటీ–మీటర్లకు పైగా వర్షం కురిస్తే దానిని క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటు–ంటారు. ఇక 5 సెంటీ–మీటర్ల కంటే తక్కువ ఉంటే వాటిని మినీ క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటాం. ఇటు–వంటి వర్షాలు సాధారణంగా పర్వతాలు, కొండ ప్రదేశాల్లో కురుస్తుంటాయి. ముఖ్యంగా హిమాలయాల్లో తరచూ వీటిని చూడొచ్చు. భారీ ప్రాణ, ఆస్తి నష్టాలకు దారితీసే ఈ క్లౌడ్‌బరస్ట్‌లు గతంలోనూ చోటు చేసుకొన్నాయి.

## ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం

**మేడ్చల్,ఆగస్టు 5( వెలుతురు):**

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ఐటీ–, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మాటలతో కాకుండా పనుల చేసి తమది చేతల ప్రభుత్వమని చెబుతున్నామని అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని చెప్పారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నా మన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందించామని.. మరో 60 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అందజేస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ– హామీలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ–లు ఏర్పాటు– చేసి వారికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు– తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వజ్రేష్ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై సిబిఐ విచారణను పట్టించుకోని కాంగ్రెస్

**పెద్దపల్లి,ఆగస్టు 5( వెలుతురు):**

కాళేశ్వరం నివేదిక లీకులను పట్టించుకోమని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం నివేదిక పెట్టిన తర్వాతే స్పందిస్తామని, కాళేశ్వరం నివేదిక ప్రభుత్వానిదా..కాంగ్రెస్‌దా అని చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. మొదటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బిజెపి చెబుతుందన్నారు. సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కానీ దీనిపై కాంగ్రెస్ వెనకడుగు వేసిందన్నారు. నిజాయితీగా,చిత్తశుద్ధితో విచారణ జరగాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు.బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని, బిసి జాబితాలో ముస్లింలను కలపొద్దని కాంగ్రెస్ ను కోరారు. కాంగ్రెస్ కు బిసిలపై ప్రేమ ఉంటే మహేశ్వర్ గౌడ్ ముఖ్యమంత్రిని చేయాలని రాంచందర్ రావు పలుమార్లు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

## దేశానికి ఆదర్శంగా పి-4 కార్యక్రమం

19 నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు– సీఎం తెలిపారు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదన్నారు. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుంది. బంగారు కుటుంబాలకు కావాల్సింది భావోద్వేగాలతో కూడిన బంధం, చేయూత మాత్రమే. సీఎస్ఆర్ నిధులతో బిల్ గేట్స్‌తో పాటు– వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి మించి కుటు–ంబాలను ఆదుకోవడటమే లక్ష్యంగా పీ–4 కార్యక్రమం చేపట్టాం. ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం. బంగారు కుటు–ంబాలను ఆదుకోవడంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా స్వచ్ఛందంగానే జరుగుతుంది. ఎక్కడా ఎవరినీ బలవంతం చేయొద్దని అన్నారు. మంచి కార్యక్రమాలు అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తారు. ప్రజల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తారు. గతంలో జన్మభూమి, శ్రమదానం ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారు. కొందరికి ఆర్థిక వనరులున్నా పేదల్ని ఆదుకోవడానికి మనసు రాదు. కొందరికి మనసు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. అలాంటి వారిని గుర్తించాలి. ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే.. రేపు మార్గదర్శి అవ్వొచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు పీ–4 ద్వారా అదనపు సాయం అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్‌ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనలు రేకెత్తించాలని అన్నారు. ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయింది. 1,03,938 మందిని మార్గదర్శులుగా గుర్తించాం.



రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల కుటు–ంబాలకు ఉన్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదు చేసి ఏఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతం మంది తమ చిన్న చిన్న వ్యాపారాలను మరింత పెంచుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. బంగారు కుటు–ంబాలను దత్తత తీసుకోవడంతోపాటు– గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు కొందరు ముందుకొస్తున్నారు. నేను 250 కుటు–ంబాలను దత్తత తీసుకోవడంతోపాటు– ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాంఅని సీఎం చంద్రబాబు తెలిపారు.

## కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డబ్బులు దంచుకోవడానికీ, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికీ ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక రిపోర్ట్, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు ఒక రిపోర్ట్, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకో రిపోర్ట్.. ఇవన్నీ కుట్రలో భాగం. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇచ్చారు. 60 పేజీల రిపోర్ట్ కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడుతాం అని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పు పట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది ట్రాష్, బేస్‌లెస్. గతంలో ఇందిరా గాంధీ, చంద్రబాబు మీద వచ్చిన రిపోర్టులు న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఇవి కూడా నిలబడవని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయని అని హరీష్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారు. కానీ నిజం ఏమిటంటే, సర్ ఆర్థర్ కాటన్‌ను ఎలా పూజిస్తారో, భవిష్యత్తులో కేసీఆర్‌ను కూడా అలాగే పూజిస్తారు. సీఎం రేవంత్‌కీ ఇది తెలుసు. అందుకే మొన్న గంధమల్ల ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టాడని అన్నారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు పెట్టడమే కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు అని హరీష్ ఆరోపించారు. ఆ నిర్ణయాన్ని మార్చి మెడిగడ్డకు తీసుకెళ్లిన విషయాన్ని సీడబ్ల్యూసీ కూడా ఆమోదించింది. కాళేశ్వరం డిపిఆర్‌లో అన్నీ క్లియర్‌గా చెప్పాం. నీళ్లు లేక మార్పులు చేయాల్సి వస్తుందని బహిరంగంగానే ప్రకటించాం. కేబినెట్ నిర్ణయం ప్రకారమే ఇది జరిగింది. 2016 జూన్ 3న కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తి వివరణ ఇస్తామని హరీష్ సవాల్ విసిరారు. మీకు దమ్ముంటే మైక్ కట్ చేయకుండా మాట్లాడనివ్వాలి. ఆధారాలతోనే చర్చిస్తాం. ఇవాళ కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. తెలిస్తే ఇంకా ఆధారాలు సేకరించేవాళ్లం అని వ్యాఖ్యానించారు. ఈ నివేదికలు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే, రాజకీయ కక్షలు తీర్చుకోవడానికేనని హరీష్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలు చూసేలా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు– చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం చేసుకుని కాళేశ్వరం నిర్మించాం. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించిందా..?. ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కాటన్ మీద కూడా ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం కమిషన్ వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌ను కూడా భవిష్యత్ తరాలు దేవుడిగా కొలుస్తాయి. కాళేశ్వరం కమిషన్ పేరుతో వండి వార్చిన నివేదికను బయట పెట్టారు. మొత్తం నివేదికను బయటపెట్టలేదు. వాస్తవాలు బయటపెట్టాలన్నదే మా ఉద్దేశం. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు దండుకునేందుకు కమిషన్లు, ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు కోసం రాజకీయ కమిషన్లు. రాష్ట్ర మంతా కమిషన్లమయం చేశారు. కాంగ్రెస్, భాజపా కలిసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు మూడు సార్లు దెబ్బతిన్నా అక్కడకు ఎన్డీఏఎస్ఏ వెళ్లలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని కాళేశ్వరం కమిషన్ నివేదిక బయటపెట్టారు. కేసీఆర్, హరీశ్ రావును కమిషన్ పిలవదు అని మొదట అన్నారు..ఆ తర్వాత రాత్రికి రాత్రే కమిషన్ గడువు పెంచారు. పూర్తి నివేదిక బయటపెట్టి అసెంబ్లీలో చర్చ పెడితే... చీల్చి చెండాడుతాం. నచ్చిన పేరాలు లీకులు... నచ్చని నాయకుల్ని బాధ్యులు చేసినట్లు– ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది, నివేదిక నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్ని, అధికారుల్ని తప్పుపట్టినట్లే. ఒక వైపే చూసి, ఒక వైపే విని, ఒక వైపే నిల్చుని ఇచ్చిన నివేదికలా కనిపిస్తోంది. నివేదిక ఒక ట్రాష్.. ఆధారాలు లేని ఆరోపణలు. ప్రాజెక్టుపై ఒక సీఎం సమీక్ష చేయడం ఆయన బాధ్యత.. రాజకీయ జోక్యం ఎలా అవుతుంది? చరిత్రలో ఇలాంటి కమిషన్లు చాలా వచ్చాయి.. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే నివేదికలు న్యాయస్థానాలు, ప్రజా క్షేత్రంలో నిలబడవు. రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. తుమ్మిడి హట్టిని కాంగ్రెస్ ఏ ప్రాతిపదికన చేపట్టిందని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు ఒప్పందం చేసుకొని ఉంటే రాజీనామా చేస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేసీఆర్ సవాల్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క ఎకరాకు అయినా నీళ్లు ఇచ్చారా? రెండేళ్లలో దిల్లీకి కమిషన్లు మోశారు.. ప్రతిపక్షాలపై కేసులు, కమిషన్లు తప్ప ఏమీ చేయలేదు. వచ్చే మూడేళ్లు కూడా ఈ ప్రభుత్వం చేసేది ఇదే. కాళేశ్వరంను పడావు పెట్టి బనకచర్లకు నీరు పోవాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన. ముమ్మాటికీ తెలంగాణకు వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టు...ఈ విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. కాళేశ్వరం కూలిందని ఓ వైపు అంటారు..మరోవైపు మూసీకి గోదావరి జలాలు తీసుకొస్తామని ఎలా చెబుతారని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# పిల్లలను అమ్మే గ్యాంగులతో నమ్రతకు లింక్

**- నమ్రత పోలీస్ కస్టడీలో పలు విషయాలు వెల్లడి**



**హైదరాబాద్,ఆగస్ట్5( వెలుతురు):**
సృష్టి అక్రమ సరోగసీ, ఐవీఎఫ్ శిశువుల కొనుగోలు కేసులో అరెస్టయిన డాక్టర్ నమ్రత ఐదు రోజుల కస్టడీలో పోలీసులు కీలక విషయాలను రాబట్టారు. పిల్లల్ని అమ్మే గ్యాంగులతో కూడా డాక్టర్ నమ్రతకు సంబంధాలు ఉన్నట్లు- విచారణలో తేలింది. మహారాష్ట్ర, అహ్మదాబాద్, ఆంధ్రాకు చెందిన పిల్లల్ని కిడ్నాప్ చేసే ముఠాలతో నమ్రతకు లింకులు ఉన్నాయి. పిల్లల్ని కొని అమ్ముతున్న నందిని, హర్ష, పవన్‌లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల కస్టడీలో వెల్లడైంది. గతంలోనూ పిల్లల్ని అమ్ముతూ నందిని ,హర్ష, పవన్ అరెస్ట్ కావడం గమనార్హం. ఒక్కొక్క పిల్లాడిని 3 నుంచి 5 లక్షల రూపాయలు ఇచ్చి డాక్టర్ నమ్రత కొనుగోలు చేసినట్లు- తెలిసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే దంపతులను సరోగోసి వైపు మళ్లించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు- కస్టడీలో నమ్రత నిజం బయటపెట్టింది. నందిని, హర్ష, పవన్.. కలిసి కొన్ని ఏళ్ల నుంచి పిల్లల్ని అమ్ముతున్న గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. హైదరాబాద్‌లో మరొక నాలుగు సెంటర్లకు కూడా పిల్లల్ని అమ్మినట్టు పోలీసులు గుర్తించారు. పెట్టీ- కేర్, హెడ్జ్ ,ఒయాసిస్, సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్లకు పిల్లలను అమ్మినట్లు- విచారణలో తేలింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉన్న పలు ఫెర్టిలిటీ- సెంటర్లతో ఈ ముఠాకు సంబంధాలు ఉన్నాయి. పిల్లల అమ్మకాలతో పాటు- యువతి, యువకులను ఈ గ్యాంగ్ ట్రాప్ చేసింది. యువతి, యువకుల వీర్యకణాలు, అండాలను సేకరించి అమ్ముకుంది. డాక్టర్ నమ్రత పెద్ద ఎత్తున ఈ గ్యాంగ్‌కు డబ్బులు ముట్ట జెప్పినట్లు- కస్టడీలో బయటపడింది. డాక్టర్ సదానందం సృష్టి కేసులో కీలక పాత్ర పోషించినట్లు- కూడా వెల్లడైంది. గాంధీ ఆసుపత్రిలో అనస్థీషియా డాక్టర్‌గా సదానందం కొనసాగుతున్నాడు. ప్రతి ఆపరేషన్ వెనుక సదానందం పాత్ర ఉన్నట్లు- పోలీసులు గుర్తించారు.

# బిజెపి వైపు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల చూపు

**- త్వరలోనే పార్టీలో చేరుతారని ప్రచారం**



**హైదరాబాద్,ఆగస్ట్5( వెలుతురు):**
కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో ఉక్కిరిబిక్కిరవుతున్న గులాబీ పార్టీకి మరో సంక్షోభం వచ్చి పడింది. ఆ పార్టీకి చెందిన పది మంది మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు రెడీ అవుతున్నారు. వీరిలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నట్టు- సంకేతాలు కూడా ఇచ్చారు. అయితే ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో చిక్కిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావు, పైలట్ రోహిత్ రెడ్డి కూడా పార్టీలో బీజేపీలో చేరబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కీలక నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్టు- సమాచారం. ఈ నెల 9న నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఢిల్లీలో బీజేపీ కీలక నేతల బీఎల్ సంతోష్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకొనేందుకు రెడీ అయిపోయారని సమాచారం. వీరిలో నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఇద్దరు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే ఉన్నట్టు- తెలుస్తోంది. రెండో దఫాలో మరో ఆరుగురు బీజేపీలో చేరుతారని సమాచారం. అయితే బీజేపీతో ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో పాల్గొన్న నేతలంతా బీఎల్ సంతోష్‌తో మంతనాలు సాగించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మరో మాజీ ఎమ్మెల్యేతో పాటు- మరో ఇద్దరు కీలక నేతలు కారు దిగుతారని సమాచారం.


# బండి సంజయ్‌కు మరోమారు సిట్ నోటీసులు

**- 8న విచారణకు రావాలని ఆదేశం**



**హైదరాబాద్,ఆగస్ట్5( వెలుతురు):**
తెలంగాణ పాలిటిక్స్‌లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆగస్ట్ 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ కోరింది. ఈ మేరకు విచారణకు హాజరు అవుతానని సిట్‌కు బండి సంజయ్ రిప్లై ఇచ్చినట్లు- తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని పలుమార్లు బండి సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ఆయన పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ ఇప్పటికే పలువురు రాజకీయ నాయకుల స్టే-టె-÷-మంట్లను రికార్డ్ చేసింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఫహీం ఖురేషి తదితర నేతల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. ఇందులో భాగంగా గతంలోనే బండి సంజయ్‌కు కూడా సిట్ నోటీ-సులు జారీ చేసింది. ముందస్తు షెడ్యూల్ వల్ల బండి సంజయ్ కు సిట్ విచారణకు హాజరు కాలేదు. దీంతో ఆగస్ట్ 8వ తేదీన విచారణకు హాజరు కావాలని తాజాగా సిట్ మరోసారి నోటీస్ జారీ చేసింది.

# నాగారం భూదాన్ భూములపై విచారణ



**హైదరాబాద్, ఆగస్ట్5 (వెలుతురు):**
నాగారంలోని భూదాన్ భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేసు ఉపసంహరించుకోవాలని పోలీసులు బెదిరిస్తున్నారని పిటిషనర్ రాములు కోర్టుకు తెలిపారు. కానిస్టేబుల్ కోర్టు ముందు హాజరుకావాలని న్యాయమూర్తి గత విచారణ సందర్భంగా ఆదేశించారు. దీంతో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మంగళవారం న్యాయమూర్తి ఎదుట విచారణ హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు పిటిషనర్‌కు ఫోన్ చేశానని కానిస్టేబుల్ కోర్టుకు తెలిపారు. విలేజ్ హిస్టరీ రికార్డులో వివరాల నమోదు కోసం రాములుకు ఫోన్ చేసినట్టు- పేర్కొన్నారు. విత్‌డ్రా చేసుకోవాలని పిటిషనర్‌ను ఎందుకు బెదిరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదులు మరోసారి రావొద్దని ఉన్నత న్యాయస్థానం హెచ్చరించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా ఈనెల 8న సిట్ విచారణ కానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- ఈ మేరకు పోలీసులకు లేఖ రాసిన కేంద్ర మంత్రి
- అదేరోజు సంజయ్ తోపాటు సిట్ విచారణకు హాజరుకానున్న సంజయ్ వ్యక్తిగత సిబ్బంది
- ఫోన్ ట్యాపింగ్ పై కేంద్ర నిఘావర్గాల ద్వారా కీలక సమాచారం, ఆధారాలు సేకరించిన బండి సంజయ్
- సిట్ ఎదుట కేంద్ర మంత్రి పలు ఆధారాలను సమర్పించే అవకాశం
- జడ్జీల ఫోన్లను సైతం ట్యాప్ చేయడంపట్ల బీజేపీ సీరియస్



- భార్యభర్తల బెడ్రూం మాటలను ట్యాప్ చేయడాన్ని సీరియస్ గా పరిగణిస్తున్న బీజేపీ అధిష్టానం
- ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టులో కేసు వేసిన బీజేపీ లీగల్ సెల్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ పాత్రపై ఆధారాలు సేకరిస్తున్న ఐబీవర్గాలు
- ఇప్పటికే పెద్దాయన(కేసీఆర్) చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని సిట్ ఎదుట అంగీకరించిన రాధాకిషన్ రావు
- డీజీపీ ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు వెల్లడించిన ప్రభాకర్ రావు
- కేసీఆర్, కేటీఆర్ ల చుట్టు బిగిస్తున్న ఉచ్చు
- ఈనెల 8న బండి సంజయ్ సిట్ ఎదుట ఏం చెప్పబోతున్నారనే అంశంపై కొనసాగుతున్న చర్చ
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై జాతీయ స్థాయిలో చర్చకు సిద్ధమవుతున్న బీజేపీ అధిష్టానం
- సీబీఐ విచారణకు పట్టుపడుతున్న బీజేపీ

న్యూఢిల్లీ వెలుతురు ఆగస్టు 05:

# నాడు మేం చెప్పినట్లే కేసీఆర్ దోపిడీ బట్టబయలు

**- పిజి ఘోష్ నివేదికతో కాళేశ్వరంలో అవినీతి బహిర్గతం**

**- అవినీతి సొమ్ము పంచడానికి వస్తే తగిన బుద్ధి చెప్పండి**

**- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**ఖమ్మం / హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**
ఎన్నికల ముందు తెలంగాణ రాష్ట్రాన్ని, ప్రజల సొమ్మును కేసీఆర్ దోచుకున్నారని మేము చెప్పాం. 15 నెలల విచారణ తర్వాత జస్టిస్ పీసీ ఘోష్ 665 పేజీల తీర్పు ఇచ్చారు.







కాళేశ్వరం అవకతవకలు అందులో రుజువయ్యాయి. అక్రమంగా దోచుకున్న డబ్బులు మళ్లీ ఖర్చు పెట్టడానికి మీ దగ్గరకు వస్తారు. ఆ డబ్బు తీసుకుని బీఆర్ఎస్‌కు రెండు చెంపలు చెళ్లుమనిపించాలి" అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. తిరుమలాయపాలెం మండలంలో మంగళవారం నాడు రెండు చోట్ల రూ.3.30 కోట్ల విలువైన పీఆర్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు వేదిక వద్ద నూతన రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని "ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాం. ఇంకా మూడు విడతల్లో మరిన్ని ఇళ్లు ఇవ్వబోతున్నాం. ఎవరి రాజకీయ అభిప్రాయం ఎలా ఉన్నా, ఎవరికి ఓటు వేస్తారో అడగకుండానే ఇళ్లు ఇస్తాం" అని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ అభద్రతకు గురికావద్దని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల దీవెనలు ఇందిరమ్మ ప్రభుత్వానికి లభించాలని కోరారు. రాష్ట్రంలో 15 కొత్త ఐటీఐ కాలేజీలలో ఒకటి తిరుమలాయపాలెంకు కేటాయించామని, 30 పడకల ఆసుపత్రిని 26 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. తిరుమలాయపాలెం మండల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.77.50 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు.ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ కొనసాగుతున్నాయని గుర్తు చేశారు.ధరణి పేదలకు శాపంగా మారింది. దానిని బంగాళాఖాతంలో పడేసి, భూభారతి వ్యవస్థను తెచ్చాం. రెండు సార్లు మాయమాటలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌ను ప్రజలు మూడోసారి చెంపచెల్లుమనిపించారు" అని మంత్రి విమర్శించారు.

# ఆగస్ట్‌లో పెరగనున్న యూరియా వినయోగం

**మరో 3 లక్షల మెట్రిక్ టన్నులయూరియా అవసరం**

**తక్షణం విడుదల చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ**



**హైదరాబాద్,ఆగస్ట్5( వెలుతురు):**
రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటు-గా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తిన పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో పంటల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందని అన్నారు. గత ఏప్రిల్ 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందన్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతిగా రావాల్సిన యూరియాకు సంబంధించి షిప్ మెంట్ వివరాలు ఇంకా రాలేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా దేశీయ సంస్థల నుండి 11,000 మెట్రిక్ టన్నులు, ఇతరత్రా 7,000 మెట్రిక్ టన్నులు ఆగస్టులో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వారు సరఫరా చేయలేమని తెలియజేసినట్టు- పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ విషయంలో కేంద్ర రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి జెపి నడ్డా తక్షణ చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా కోరారు. అదేవిధంగా ఈ ఆగస్టులో సరఫరా చేయలేమని చెప్పినందువల్ల ఏర్పడిన 18,000 మెట్రిక్ టన్నుల కొరతను భర్తీ చేయాలని అన్నారు. ఆగస్టు నెలలో కేటాయించిన విధంగా రాష్ట్రానికి దిగుమతి ద్వారా అందాల్సిన 39,600 మెట్రిక్ టన్నుల యూరియాను ఈ నెల 20వ తేదీకి ముందు రాష్ట్రానికి చేరే నౌకల ద్వారా ఇవ్వాలని అన్నారు. దాంతో పాటు- ఏప్రిల్ నుండి జూలై మధ్య ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరతను కూడా ఆగస్టు నెలలో మంజూరు చేయాలని లేఖ ద్వారా అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగు అవుతున్న పంటలకు యూరియా లభ్యత నిరవధికంగా ఉండేలా చూసేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# పత్రికలు సమాజానికి దర్పణం లాంటివి

**- మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి**

**- 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణలో వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్,ఆగస్టు 5( వెలుతురు):**
పత్రికలు సమాజానికి దర్పణం లాంటివని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని అవినీతిని ప్రజలకు జర్నలిస్టులు వివరించాలి. నిజాన్ని తెలియజేసి తీర్పును ప్రజలకే వదిలేయాలి. మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి. గతంలో బూతులు మాట్లాడిన నేతలు ఎవరూ గెలవలేదు. అలాంటి వారిని నిలువరించాలని ఓ మహిళ నాతో అన్నారు. పోలింగ్‌బూత్‌ల ద్వారా బూతు నేతల నోరు మూయించాలని ఆమెకు చెప్పానని వెంకయ్యనాయుడు అన్నారు. భాష విషయంలో నాయకుల తీరు మారాలని వెంకయ్యనాయుడు సూచించారు. సీనియర్ సంపాదకులు ఐ.వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మీడియాతో మాట్లాడారు. విలీనం - విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదని.. దానికోసమే కాలమ్స్ ఉన్నాయని, రాసుకోవడానికి అందులో వాళ్ల అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో



రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. చాలా మంది జర్నలిస్టులు కొత్తగా యూట్యూబ్‌లో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. పాత్రికేయంలో భాష చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు వెంకయ్యనాయుడు. తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు... తాను తన అమ్మను చూడలేదని భావోద్వేగానికి గురయ్యారు. రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడు...తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తాను బీజేపీ ఆఫీస్‌కు పోలేదని వెల్లడించారు. తాను ఉప రాష్ట్రపతిగా దిగిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ ఆఫీస్ గుమ్మం తొక్కలేదని చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# సంపాదకీయం..

# కన్నడనాట అత్యాచార కాండ !

ధర్మస్థలి....ప్రజ్వల్ రేవణ్ణ ఈ రెండు పేర్లు దేశానికి ఇప్పుడు బాగా తెలిసి పోయాయి. ముఖ్యంగా కర్నాటక ప్రజల నోళ్లల్లో నిత్యం నానుతున్న పేర్లుగా చెప్పుకోవాలి. రెండూ ఒకే తరహా కేసులుగా చూడొచ్చు. ధ్మస్థలిలో అమ్మాయిలపై అత్యాచారం చేసి చంపేస్తున్నారని, అదృశ్యం అయిన కేసుల్లో ఇప్పటికీ ఆచూకీ దక్కలేదని గుర్తించారు. అనేకమంది అమ్మాయిల మరణాలు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. ఒకరిద్దరు మాత్రమే ఫిర్యాదు చేశారు. వాటిపై చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో నాటి బిజెపి ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా సీరియస్‌గా లేవు. అందుకే ప్రజల్లో ఉన్న సీరియస్ నెస్ ఇక్కడ కానరావడం లేదు. అందుకే దర్యాప్తు నత్తనడకన సాగిస్తున్నారు. సిట్‌ను వేసినా పెద్దగా ఉపయోగం లేదన్న చర్చ కూడా మొదలయ్యింది. ధర్మస్థలి వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉన్నాయని, మాఫియా ఉందని అంటున్నారు. బాగా పలుకుబడి ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉండడంతోనే అసలు నిజాలు బయటకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ఈ కుంభస్థలం ఎప్పుడో బద్దలు కాక తప్పదు. మాజీ సానిటేషన్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుతో కొంత కదలిక వచ్చినా, పాలకుల్లో ఏ మాత్రం చిత్తశుద్ధి లోపించినా దర్యాప్తు ముందుకు సాగదు. ఇకపోతే ప్రజ్వల్ రేవణ్ణ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఓ మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడిగా, ఎంపిగా సాగించినా అత్యాచారకాండ అంతాఇంతా కాదు. దీనిపై చర్చించడం కూడా అవసరం. ఇలాంటి దగుల్బాజీల పాపం పండి జైలు శిక్ష పడింది. లేకపోతే మరింతగా విర్రవీగేవారు. ఎన్‌డిఎ కూటమి పార్టీ జెడిఎస్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక దాడి కేసులు నమోదైనప్పుడు




కనీసమాత్రంగా కూడా నేతలు స్పందించలేదు. ప్రజల్వల్ తీర్పును స్వాగతించలేదు. న్యాయస్థానం శిక్ష విధించాక కూడా మోడీ నుంచి కాని, బిజెపి నుంచికాని ఎలాంటి స్పందన లేదంటే మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారికి మద్దతిచ్చినట్లుగా భావించాలి. ప్రజ్వల్‌పై ఒక కేసులోనే శిక్ష పడింది. మరిన్ని కేసులు విచారణలో ఉన్నాయి. వాటిలోనూ బాధితులకు న్యాయం జరిగేలా, నిందితునికి శిక్ష పడేలా అన్ని వ్యవస్థలూ పని చేయాలి. రాజకీయ పలుకుబడి, డబ్బు ఉన్న ప్రజ్వల్ పైకోర్టులను ఆశ్రయించే అవకాశం లేకపోలేదు. తప్పించుకోకుండా పోలీసులు, బాధితులు అప్రమత్తంగా ఉండాలి. ఇకపోతే కేసు వివరాల్లోకి వెళితే..ప్రజ్వల్ రేవణ్ణ నిజంగానే ఓ దుర్మార్గుడు. ఎందరో మహిళల మానాలను దోచుకున్న దుండగుడు. అతనికి జీవితఖైదు విధించడం సరైనదే. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరాలి. ఇకపోతే రేవణ్ణ కేసులు చూస్తే ఆశ్చర్యం కలగమానదు. ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారం జరిపిన కేసులో అభియోగాలు రుజువు కావడంతో మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు బెంగళూరు ప్రజాప్రతినిధుల న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్‌ను దోషిగా నిర్ధారించిన కోర్టు, యావజ్జీవంతోపాటు 11.35 లక్షల రూపాయలు జరిమానా విధించి, దానిలో 11 లక్షలు బాధితురాలికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మహిళలను కట్టుబానిసలుగా, వారిని సెక్స్ వర్కర్లుగా చూస్తున్న ప్రస్తుత సమయంలో న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పు మహిళలకు ఆశాకిరణం. రోజురోజుకు స్త్రీలపై అఘాయిత్యాల పరంపర కొనసాగుతున్న వేళ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపిందనే చెప్పాలి. ప్రజ్వల్‌పై మూడు లైంగిక దాడి కేసులు, ఒక లైంగిక వేధింపుల కేసు నమోదుకాగా మొదటి కేసులోనే శిక్ష పడింది. మిగతా కేసులు విచారణలో ఉన్నాయి. మైసూర్ ఆర్‌కె నగర్‌కు చెందిన ఒక మహిళ తనపై ఫాంహౌస్‌లో ప్రజ్వల్ పలుమార్లు అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేయడంతో తొలికేసు నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో రెండవ తడవ హసన్ నియోజకవర్గం నుంచి ప్రజ్వల్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేశారు. పోలింగ్ ముగిశాక కేసు నమోదు కావడంతో జర్మనీకి పారిపోయాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం అతన్ని స్వదేశానికి రప్పించి గతేడాది మే 31న అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి రిమాండ్ ఖైదీగా ప్రజ్వల్ జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. కేసు దర్యాప్తు సమయంలో సిట్ కనుగొన్న విషయాలు విస్తుగొల్పేలా ఉన్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ ప్రజాప్రతినిధిగా సమస్యలపై తన దగ్గరకొచ్చే మహిళలపై లైంగికదాడికి ఒడిగట్టాడు. బెదిరించో బలవంతంగానో లోబరుచుకునో లైంగిక దాడులకు బరితెగించాడు. అత్యాచారం చేసిన ప్రతిసారీ తన ఐ-ఫోన్‌లో ఆ దృశ్యాలను తానే రికార్డు చేసుకున్నాడు. అటువంటి రెండు వేలకు పైచిలుకు వీడియోల ను దర్యాప్తు సందర్భంగా ప్రజ్వల్ ఫోన్‌లో కనుగొన్నారు. అవి మార్ఫింగ్ వీడియోలుగా, రాజకీయ కుట్రగా ప్రజ్వల్ బుకాయించి,తప్పించుకోచూశాడు. అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీడియోలను విదేశాలకు పంపి, ఫోరెన్సిక్ పరీక్షలు చేయించి నిజమైనవేనని నిర్ధారించారు. కేవలం 14 మాసాల్లోనే కేసు ఛేదించడం వెనుక దర్యాప్తు అధికారుల కృషి, కోర్టులో వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ కనబరిచిన చాకచక్యం అభినందించాల్సిందే. ఇవన్నీ కలిసి ప్రజ్వల్‌ను బోనులో దోషిగా నిలబెట్టాయి. అన్నింటికీ మించినది న్యాయం కోసం, దోషికి శిక్ష పడాలని బాధితురాలు కనబర్చిన పట్టుదల మహిళాలోకానికి స్ఫూర్తినిస్తుంది. ప్రజ్వల్ రేవణ్ణ సాదాసీదా యువకుడు కాదు. కర్ణాటక రాజకీయాలను శాసిస్తున్న కుటుంబానికి చెందిన మాజీ ఎంపి. ఆయన తాత దేవెగౌడ మాజీ ప్రధాని, పినతండ్రి కుమార స్వామి కేంద్ర మంత్రి, తండ్రి మాజీ రాష్ట్ర మంత్రి, ప్రస్తుత ఎంఎల్‌ఎ హెచ్‌డి రేవణ్ణ, తల్లి భవానీ గతంలో కార్పొరేటర్, సోదరుడు సూరజ్ ఎంఎల్‌ఎ. ఇంతమంది రాజకీయ కుటుంబంలో ఉన్న ప్రజల్వల్ తనకు తిరుగులేదని భావించాడు. అత్యాచార బాధితురాలిని అపహరించిన ప్రజ్వల్ తల్లి భవానీపైనా కేసు , ప్రజ్వల్ తండ్రి హెచ్‌డి రేవణ్ణపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణల కేసు నమోదయ్యాయంటే బాధితులను ప్రజ్వల్ కుటుంబం తమ రాజకీయ పలుకుబడితో ఏ స్థాయిలో భయభ్రాంతులకు గురి చేసిందో తెలుస్తుంది. అయితే పాపం పండింది. ప్రజ్వలు ఎంతగా మొత్తుకున్నా సాక్ష్యాలు బలంగా ఉన్నాయి. అత్యాచారాలు చేసి పైశాచికానందం పొంది, వాటిని సెల్ ఫోన్లలో వీడియోలు తీసి మురిసి పోయిన ప్రజ్వల్ లాంటి వారికి జీవిత ఖైదు సరిపోదు. అలాగే ధర్మస్థలిపైనా నిజాయితీగా విచారణ జరగాలి. అప్పుడే ప్రజల్లో భరోసా వస్తుంది. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధని చాటుకోవడానికి ఇదో మంచి అవకాశం. రాజ్యాంగం పుస్తకాన్నిపట్టుకు తిరుగుతున్న రాహుల్ ఈ విషయంలో తమ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ధర్మస్థలి విషయంలోనూ నిగ్గు తేలేలా చేస్తే మంచిది.

## అద్వానీ రికార్డు బ్రేక్

**- అత్యధిక కాలం హోంమంత్రిగా అమిత్ షా**



**న్యూఢిల్లీ,ఆగస్టు5 ( వెలుతురు):**

ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించినట్లుగానే హోంమంత్రి అమిత్ షా కూడా అత్యధిక కాలం హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీకేంద్ర హోం మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు. మొత్తంగా అమిత్ షా అత్యధిక కాలం హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పాలరు.

## బీహార్ ఓటు సవరణపై నిరసనలు

**- పార్లమెంట్ ముందు ఇండియా కూటమి ఆందోళన**

**న్యూఢిల్లీ,ఆగస్టు5 ( వెలుతురు):**



బీహార్‌లో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పలువురు ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంటులో నిరసన చేపట్టారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుసగా పదవరోజైన మంగళవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. పార్లమెంట్ మకరద్వారం సమీపంలో చేపట్టిన నిరసనలో వామపక్షాలు, డిఎంకె, టిఎంసి ఎంపిలు సహా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలు పాల్గొన్నారు. 'మన ఓటు-. మన హక్కు. మన పోరాటం', 'ఎస్ఐఆర్- సైలెంట్ ఇన్విజబుల్ రిగ్గింగ్' అని రాసి వున్న బ్యానర్లు ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్ఐఆర్' ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు- పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఓటర్ల ఓటు- హక్కును తొలగించడం లక్ష్యంగా ఇసిఐ కసరత్తు చేపడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలంటూ పార్లమెంట్ ఉభయ స భల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణించడంతో సోమవారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టలేదు.

## దేశ పౌరులం కాస్త సట్టసభల్లో

# స్థానం ఇయ్యండిసారు...!

మనది సంక్షేమ రాజ్యం కావాలన్నది రాజ్యాంగం ఉద్దేశం. అనగా, అధికాదాయాలు, అల్పాదాయాల మధ్య వ్యత్యాసాలు తగ్గటమన్న మాట. సామాజికంగా అన్ని కులాల మధ్య సమానత రావాలన్నది కూడా లక్ష్యం. పధ్నాలుగు ఏళ్ల వయసులోపు పిల్లలందరికి నిర్బంధ ఉచిత విద్య బోధించాలని రాజ్యాంగం రాజ్యాన్ని ఆదేశించింది. అదేవిధంగా ప్రజలకు ఉచిత ఆరోగ్య-వైద్య సేవలు అందించాలని, కమ్యూనిటీ అభివృద్ధి, కుటుంబ నియంత్రణ పథకాలు అమలు పరచాలని, పనిచేయగల స్థితిలో ఉన్నవారందరికి పని కల్పించాలని కూడా నిర్దేశించింది. ఇటువంటివే ఇంకా ఉన్నాయి. దేశ సంపదల న్యాయమైన, సమానమైన పంపిణీ వాటిలో ఒకటి. ఈ వివిధ కార్యకలాపాలన్నింటి ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బ్రిటిష్ పాలనా కాలం నుంచి రాజ్యాంగ రచనా సమయం వరకు వివిధ చట్టసభలు, పరిపాలనా వ్యవస్థ, చివరకు సైన్యంలో కూడా ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, పార్శీలు, ఆంగ్లో-ఇండియన్లు, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేది. 1949లో రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత ఈ పద్దతి మారలేదుగాని, కొన్ని కమ్యూనిటీలకు చట్టబద్ధమైన ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ముస్లిములు, భారతీయ క్రైస్తవులు, సిక్కులు, పార్శీలను జాబితా నుంచి తొలగించారు. అణగారిన వర్గాలు, ఆదివాసులు, ఆంగ్లో-ఇండియన్లకు చట్టసభలలో చట్టబద్ధమైన ప్రాతినిధ్యం కొనసాగింది. ప్రభుత్వోద్యోగాలకు సంబంధించి ఎస్సి, ఎస్టి, ఓబీసీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. ఆ వర్గాలు వెనుకబడినవి కావటం అందుకు కారణం. కొన్ని అసెంబ్లీలో ఆంగ్లో-ఇండియన్లను నామినేట్ చేసేందుకు కూడా అవకాశం ఉంది. ఎస్సి, ఎస్టి, ఓబీసీలకు వారి జనాభా దామాషాలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆర్టికల్స్ 335, 338 (3) లతో కలిపి చూసినపుడు ఆర్టికల్ 16 (4) సూచిస్తున్నది.భారత రాజ్యాంగం ఆర్టికల్ 333,ఈ ఆర్టికల్ ప్రకారం, కొన్ని రాష్ట్రాలలో గవర్నరికి ఒక లేదా అంతకంటే ఎక్కువ మంది ఆంగ్లేతర వర్గాలకు చెందిన వ్యక్తులను నామినేట్ చేయగల అధికారాన్ని కల్పిస్తుంది, ముఖ్యంగా ఆ వర్గాలు అసమర్థంగా ప్రాతినిధ్యం పొందినపుడు. ఉదాహరణకు, ఆంగ్లో ఇండియన్ కమ్యూనిటీకి అసెంబ్లీ సభ్యుడిని నామినేట్ చేయగలదన్నదే ఉద్దేశం. అయితే 104వ రాజ్యాంగ సవరణ (2020) ద్వారా ఈ నిబంధన తొలగించబడింది. కానీ ఇది ఒక ముఖ్యమైన చరిత్రాత్మక మార్గదర్శకం.ఈ నాలుగు ఆర్టికల్స్ను సమన్వయంగా చూస్తే రాజ్యాంగం వెనుకబడిన వర్గాలకు ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలను కల్పించాలనే సంకల్పాన్ని వ్యక్తపరుస్తుంది. ఆర్టికల్ 16(4) రిజర్వేషన్లను సూచిస్తే, ఆర్టికల్ 335 పరిపాలనా సామర్థ్యాన్ని, ఆర్టికల్ 338(3) సంఘటనలపై పర్యవేక్షణను, Article 333 నామినేషన్ ద్వారా ప్రాతినిధ్యాన్ని నిర్ధారించేందుకు ఉద్దేశించబడింది. ఇవన్నీ కలిసి భారత రాజ్యాంగం సామాజిక న్యాయాన్ని సాకారం చేయాలనే తపనను ప్రతిబింబిస్తాయి. ఇక అదే ప్రకారం ఆంగ్లో ఇండియన్ వర్గానికి పదవులు వచ్చాయి. కానీ,దేశ మూలవాసులకు ఆ అవకాశం ఎందుకు ఇవ్వలేదు? బీసీ, ఎంబీసీ, మైనార్టీ.లాంటి వర్గాలకు ఉద్దేశించిన రిజర్వేషన్లలో వీరిని చేర్చకపోవడం ఎవరికి లాభకరం? వీరిని కో ఆప్షన్ సభ్యులుగా, నామినేట్ పదవుల్లోకి తీసుకురావడంలో ఇంతవరకు ఎందుకు నిర్లక్ష్యం?ఇప్పటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 42 శాతం వర్గాలకు రిజర్వేషన్లను కల్పిస్తామన్న హామీ ఇచ్చింది. కానీ,
ఈ హామీ కేవలం స్థానిక సంస్థల వరకేనా?అసెంబ్లీ, పార్లమెంటు స్థాయిలో ఈ వర్గాల ప్రాతినిధ్యం ఎలా పెరుగుతుంది?కులాలను A, B, C, D లో విభజించి న్యాయం చేస్తారా.. దీనికి ప్రతిపక్షాలు బిజెపి, బి ఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, ఎంఐఎం, సహకరిస్తారా, గత 60 ఏళ్లుగా కాంగ్రెస్ ఏమి చేసింది? ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటుందా అనేది ఒక ప్రశ్న.ఇవి ప్రజాస్వామ్య పద్ధతుల్లో గంభీరంగా పరిశీలించాల్సిన ప్రశ్నలు.యూరోప్ లోని “రోమా జిప్సీలు”, ఆఫ్రికాలోని “మాస్‌య్ తెగలు” వంటి వర్గాలకు స్థానిక చట్టసభల్లో ప్రత్యేక సీట్లు, ప్రతినిధులు ఉంటారు. UN సూత్రాల ప్రకారం Indigenous Peoples (మూలవాసులు)కి ప్రత్యేక ప్రాతినిధ్యం, భాషా హక్కులు, సంస్కృతిక రక్షణ ఉండాలి.అలాంటప్పుడు భారతదేశం కూడా అదే దిశగా ఎందుకు సాగడం లేదు?నామినేట్ పదవుల విస్తరణ: ఆర్టికల్ 333 లాంటి అధికారం ప్రతి రాష్ట్రంలో ఉన్నట్లయితే, ప్రతి జిల్లాలోనూ DNT/NT/OBC వర్గాల ప్రతినిధిని నామినేట్ చేయాలి. పంచాయతీ, మునిసిపాలిటీ లెవల్లో కో ఆప్షన్ సభ్యులుగా నియమించే విధానాన్ని నిర్మించాలి. A, B, C, D కేటగిరీల వెనుక ఉన్న రేషనాలిటీ స్పష్టంగా చెప్పాలి. జాతులుగా కాకుండా, చారిత్రిక వంచన ఆధారంగా కేటగిరీలు రూపొందించాలి. ప్రతీ పార్టీ తమ అభ్యర్థులలో కనీసం 10% ఈ వర్గాల వారు ఉండేలా కఠిన నిబంధనలు వేసుకోవాలి.విదేశీ మూలస్తులైన ఆంగ్లో ఇండియన్లకు రాజ్యాంగ ప్రాతినిధ్యం కల్పించిన మనం – ఈ దేశపు మూలవాసులైన బుడబుక్కల, దాసరి, దేవాంగ, పల్లి, వాడబలుజా, నెయ్యాలా, బాల సంతు, దొమ్మర, గంగిరెద్దువారు, నక్కల, , జోగి, పాముల, చాకలి, దాసరి, గంగిరెద్దులవారు, జంగం, జోగి, కాటిపాపల, మహేంద్ర ( మేదరి ), మొండివారు, నాయి బ్రాహ్మణ, వంశరాజ్, పర్ది ,( నిషికారి), పంబల, పెద్దమ్మ వాళ్ళు, దేవరవాండ్లు, ఎల్లమ్మ వాళ్ళు, ముత్యాలమ్మ వాళ్లు, దమ్మలి/ దమల/ వీరముష్టి( నెట్టికోటల) వీరభద్రియ, వాల్మీకి బోయ, బేధర్, కిరాటక, నిషాది, ఎల్లోపి ,పెద్ద బోయ, తలయారి, చుండువాళ్లు ఎల్లోపి, గూడాల, కంజర, బట్ట, మొండిపట్టు, నొక్కరా, పరికి ముగ్గుల, యాట, చెప్పే మారి, బొందిలి, బావాజీ, బేడ, బత్రాజు, గొలుసుల వాండ్లకు బీసీ కులాల్లో ఇంకా మన చట్టసభలకు పోనీ అనేక కులాలను వారికి చట్టసభల్లో చెప్పుకునే హక్కును కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వేలాది కోట్ల రూపాయలు పెట్టి వాళ్ళు ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితి ఎన్నికల కమిషన్ ప్రకారం సుమారు ఒక ఎమ్మెల్యేకు పోటీ చేయాలంటే 40 లక్షల రూపాయలు ఖర్చు చేయాలి. అదే ఎంపీగా చేయాలంటే సుమారు 70 లక్షల వరకు ఖర్చు చేయాలి. ఈ కులాలు అంత డబ్బు పెట్టి గెలవగలరా ఒకసారి ఆలోచించాలి, ఎన్నికల నిబంధనల ప్రకారమే... బడాబడా పార్టీలు పెడుతున్న ఖర్చులు ఒక ఎంపీకి 100 కోట్లు ఒక ఎమ్మెల్యేకు 75 కోట్లకు ఖర్చు చేస్తున్న పెట్టుబడిదారులను ఈ నిమ్మ కులాలు ఓడించగలవా..? దీని గురించి ప్రభుత్వం ఆలోచించాలి. ఇక చట్టసభల్లో ప్రతినిధిత్వం లేని కులాలకు నామినేటెడ్ పోస్టుల ద్వారా న్యాయం అవసరమే,విద్య, ఉద్యోగాల్లో ప్రభుత్వాలు ఏ, బి, సి, డి మరియు ఈడబ్ల్యూఎస్ (EWS) తరహాలో రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఉద్దేశ్యం వెనుకబడిన తరగతులకు సమానావకాశాలు కల్పించి, సమాజంలో సమతుల్యత తీసుకురావడమే. అయితే, ఇదే తాత్వికత రాజకీయ వ్యవస్థలో పక్కన పడేస్తున్న తీరు గమనార్హం. కొన్ని కులాలు అనేక దశాబ్దాలుగా శాసనసభలలోకి ప్రాతినిధ్యం పొందలేకపోతున్నాయి. వాస్తవంగా మాట్లాడితే, రాజకీయ స్థాయిలో తాము లేకపోవడమే ఆయా కులాల అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారింది.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, సాంఘిక న్యాయ పరిరక్షణ కొరకూ రాజ్యాంగ సవరణ ద్వారా ఆయా కులాలకు నామినేటెడ్ పోస్టుల ద్వారా శాసన మండలిలో లేదా శాసన సభల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే గవర్నర్ కోటాలో నిపుణులు, సాంఘిక ఉద్యమకారులు, కళాకారులు వంటి వారిని నామినేట్ చేయవచ్చని రాజ్యాంగం అనుమతిస్తుంది. అదే విధంగా, ఎన్నడూ శాసనసభల్లో అడుగుపెట్టలేని తరగతులకూ ఇదే ప్రాతిపదికన అవకాశం కల్పించవచ్చు. ఈ విధానం రెండు దిశల్లో లాభం చేకూర్చుతుంది. మొదటిది – శాసనసభల్లో అన్ని వర్గాల ప్రతినిధులు ఉండటంవల్ల సరైన చర్చ, సమగ్ర విధాన నిర్ణయాలు జరగగలవు. రెండవది – రాజకీయం నుండి దూరంగా ఉన్న వర్గాలకు అంగీకారం, గుర్తింపు లభిస్తుంది. ఇది వారి సామాజిక పురోగతికి బలమైన మూలస్తంభంగా మారుతుంది. పరిశీలన చేయాల్సిన మరొక అంశం ఏమిటంటే, రాజకీయ రిజర్వేషన్ ఇప్పటివరకు SC.ST. వరకే పరిమితమైంది. బీసీలకు కూడా చాలా ఆలస్యంగా కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే రాజ్యాంగ పరిష్కారాలు అమలు చేస్తున్నాయి. మరి అసలు శాసనసభల ముఖాన్ని ఎప్పటికీ చూడలేని మిగిలిన కులాల విషయంలో మాత్రం ఎందుకు మూగబోతున్నాం? రాజకీయ న్యాయం సామాజిక న్యాయానికి పొడిగింపు. ఎక్కడ సమాజం ఉన్నత స్థాయికి చేరాలని కోరుకుంటే, అక్కడ రాజకీయంగా దూరంగా ఉన్న వర్గాలను ముందుకు తేవాల్సిందే. అందుకే, ఇటువంటి కులాల కోసం ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా నామినేటెడ్ పోస్టులు కల్పించడమే సమర్థవంతమైన మార్గం. ఇది ప్రజాస్వామ్య పునాది విలువలకు కూడా తగిన చర్యగానే నిలుస్తుంది. ఇక చట్టసభల్లో ఈ కులాలపై చర్చ జరగాల్సిందే. 1952 నుంచి 2020 వరకు ఆంగ్ల ఇండియన్ కు ఇచ్చిన నామినేట్ ఎంపీ .ఎమ్మెల్యే. అదే చట్టం ఈ కులాలకు అదే న్యాయం ఎందుకు చిన్న కులాలకు ఇవ్వలేకపోతున్నాం? ఇది కేవలం రిజర్వేషన్ అంశం కాదు. ఇది ప్రజాస్వామ్యంలో గళం లేని వర్గాలకు గళం ఇచ్చే బాధ్యత అనేది రాజకీయ పార్టీలు నాయకులు గుర్తు ఎరగాలి.



మన్నారం నాగరాజు

## జనసందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం



**మంచాల వెలుతురు ఆగస్టు 5:**
మంచాల మండలం కేంద్రంలో జనసందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంచాల బాలికల పాఠశాలలో సాధురం ఐ హాస్పిటల్ ద్వారా ఉచిత కంటి పరీక్ష శిబిరం ప్రారంభించడం జరిగింది 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 25మందికి కంటి అద్దాలను గుర్తించడం జరిగింది ఈసందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు కార్యక్రమంలో జనసందేశ్ ఫౌండేషన్ సభ్యులు వింజమూరి వెంకట్ రెడ్డి సాధూరం కంటి హాస్పిటల్ డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వాల బాల్ రాజ్, కడారి లింగ మహేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కళ్లద్దాల పంపిణీ.



**మంచాల వెలుతురు ఆగస్టు 5:**
మంచాల మండలం కేంద్రంలోని చెరువు కట్టపైన శ్రీ బసవేశ్వరుని విగ్రహం ముందు లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు గత నెల 27వ తేదీన రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ పురాణం బలిజ సంఘం అధ్వర్యంలో మండల కేంద్రంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు కళ్లద్దాలు అవసరమైన 27మందికి మంగళవారం రోజున కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేసారు మరో పది మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయవలసి ఉందనీ ఈ నెల 12వ తేదీన ఆపరేషన్లు చేయిస్తున్న, మని లయన్స్ క్లబ్ డాక్టర్ యంయస్ రెడ్డి చెప్పరు ఈకార్యక్రమంలో బలిజ సంఘం గౌరవ అధ్యక్షులు బిక్షపతిఅ ధ్యక్షులు కొత్తూరు శేఖరప్ప అన్నారు కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జక్కహరీశ్, కార్యవర్గసభ్యులు ఈశ్వరప్ప, స్థానిక కొఆర్డినే టర్ అశ్వాల బాల్ రాజ్ మహిళలు పాల్గొన్నారు.


## ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం




**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**
నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్ లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 7893141797.

## 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నాం

**- టీజీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు ఎంబి కృష్ణయాదవ్**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**
42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నామని టీజీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ మరియు ఆశన్న ఎంవి రమణ. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికి దిక్సూచిగా పనిచేస్తుందని అన్నారు.

## సీజనల్ వ్యాధుల పేరుతో రోగుల జేబులు గుల్ల చేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు

**- ప్రభుత్వ మెడికల్ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.**

**- జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**
వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాల వారు రోగాల బారిన పడి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని కొందరు చిన్న రోగాన్ని పెద్దగా చూపుతూ పేదల నుంచి పెద్దమొత్తంలో వసూలు చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. రక్త కణాలు తగ్గాయని డెంగ్యూ టెస్ట్ ల పేరుతో రోగుల జేబులు ప్రైవేట్ ఆస్పత్రులు గుల్ల చేస్తున్నాయన్నారు.వేలకు వేల రూపాయల ఫీజులు చెల్లించలేక ఇటు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లలేక సామాన్య ప్రజలు తల్లడిల్లి పోతున్నారని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల పైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందని చిన్న వైద్యానికి టెస్టుల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తూన్న ప్రభుత్వ ఆసుపత్రుల పైన మెడికల్ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని లింగం గౌడ్ అన్నారు

# దేశవ్యాప్తంగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

**- దేశవ్యాప్తంగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి**

**- బీసీ రిజర్వేషన్ల పై రెండు రోజుల పాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి**

**- ఈనెల 7న గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభ దేశంలో చరిత్ర సృష్టించబోతుంది**

**- దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరించడం కోసం విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం**

**- నిన్న హైదరాబాద్ నుండి జాతీయ ఓబీసీ మహాసభకు తరలిన బిసి నేతలు**

**- జెండా ఊపి బస్సులను ప్రారంభించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్**



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 05:**
ఈనెల 7వ తారీఖున గోవా రాష్ట్రంలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభ సభకు తెలంగాణ రాష్ట్రం నుంచి బస్సుల్లో బయలుదేరిన బీసీ సంఘాల నాయకులు మంగళవారం రోజున హైదరాబాద్ నుండి బస్సులను బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ,బిసి మహిళా సంఘం అధ్యక్షురాలు బి మని మంజరి తదితర నేతలతో కలిసి జండా ఊపి ప్రారంభించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మెజార్టీ ప్రజలకు రాజ్యాధికారంలో వాటా కల్పించాలని, విద్యా ఉద్యోగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని ఎన్నో సంవత్సరాలుగా బీసీ సంఘాలు పోరాటం చేస్తున్నాయి, కానీ దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు గుత్తాధిపత్యం చేపట్టి బీసీ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తూ వారిని ఓట్లు వేసే యంత్రాలుగానే చూస్తున్నారు తప్ప వారికి రాజ్యాధికారంలో వాటా కల్పించాలని ఏ కోశాను కూడా ఏ రాజకీయ పార్టీకి



లేదు అని వారన్నారు, ఆగస్టు 7న గోవాలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభలో దేశవ్యాప్తంగా బీసీలకు ఉన్నటువంటి సమస్యల పైన వారి డిమాండ్ పైన విస్తృతంగా చర్చించి దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని విస్తరించే విధంగా పోరాటం చేయడానికి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించడానికి గోవాలో 28 రాష్ట్రాలకు సంబంధించిన పాల్గొంటారని దీనికి తెలంగాణ రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున కదిలి వెళ్లడం జరుగుతుందని వారు అన్నారు, రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం సంపద వారసత్వ రాజకీయాలు కొనసాగిస్తూ బీసీలను మోసం చేస్తూ వారి పాపం గడుపుకుంటున్నారని వారు ఆపోయారు, స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన బడుగు వర్గాల హక్కుల కోసం అడుక్కోవడం ఇక చాలని ఇకనుంచి పోరాటపటిమను పోరాట అంతాను బీసీలు ప్రత్యక్షంగా పోరాటాలకు సిద్ధం కావాలని వారు కోరారు,. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు రావులకోల్ నరేష్ ప్రజాపతి, యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బూడిద మల్లికార్జున యాదవ్, యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు భాస్కర్ మేరు, వరికుప్పల మధు, సదానందం, స్వర్ణ గౌడ్, తారకేశ్వరి, ఇంద్రం రజక, ఘన గాని నాగరాజు గౌడ్, సుజాత, శ్యామల, గౌతమి, మంజుల, భరత్ గౌడ్, సాయి, అనిల్, శ్రీధర్, మధు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల విద్యార్థులకు చేయూత

**కూకట్పల్లిలోని అనాథ పిల్లలకు స్కూల్ కిట్స్ పంపిణీ చేస్తున్న షేర్ ద విజన్ అధ్యక్షుడు నారాయణరావు**

**కూకట్పల్లి, హైదరాబాదు వెలుతురు ఆగస్టు 05:**
అనాథ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సంస్థ సహకారం అందిస్తుందని షేర్ ద విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణరావు తెలిపారు. హైదరాబాదు కూకట్పల్లిలో చీర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ బాలల ఆశ్రమంలోని 60 మంది విద్యార్థులకు రూ ఒక లక్ష విలువైన స్కూల్ కిట్స్, నిత్యావసర సరుకులను ఆయన మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. సమాజంలో అందరికీ చదువుకునే అవకాశం ఉండాలని అన్నారు. పేదరికం మూలంగా, ఆదరించే వారు లేకపోవడంతో చాలామంది చదువుకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము సంపాదించిన దాంట్లో కొంత పోగుచేసి పేదల విద్యాభివృద్ధికి సహకారం అందించాలని షేర్ దా విజన్ సంస్థను స్థాపించామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. చదువుకున్న సమాజంతోనే కుటుంబం దేశం అభివృద్ధి చెందుతుందని





అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో చీర్స్ ఫౌండేషన్ నిర్వాహకుడు అశోక్ పాల్గొన్నారు.






# తల్లిపాలకు ఎంతో ప్రాముఖ్యత...

**తల్లి పాల వారోత్సవాలలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. వెంకటేశ్వరరావు...**



**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 05:**
తల్లిపాల వారోత్సవాలు, ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ సమావేశం మందిరంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచంలో మనిషి తప్ప ఏ క్షీర జంతువులు తమ పిల్లలకు ఇతర జంతువుల పాలు పట్టదు అని తల్లిపాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని తెలిపారు. బిడ్డ పుట్టిన తర్వాత రెండు రోజులు వచ్చు పాలు మురుపాలు బిడ్డకు జీవితాంతం రక్షణ కలగజేస్తే రక్ష రక్షక కణాలు ఉంటాయన్నారు. ఇది బిడ్డకు మొదటి టీకా తో సమానం తల్లిపాలను మించిన ఆహారం మరొకటి ఉండదని



ఈ సందర్భంగా తెలియజేశారు. బిడ్డకు తల్లిపాలు ఆహారం మాత్రమే కాదు మంచి ఔషధం అని వివిధ రకాల వ్యాధుల నుండి కాపాడుతుందని తెలిపారు, రోబోశక్తి పెరగడమే కాకుండా బిడ్డ ఎదగడానికి ద్రోహం చేస్తుంది అందుకే కనీసం ఆరు నెలల పాటు తప్పకుండా తల్లిపాలు పట్టించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. సహజ సిద్ధమైన తల్లిపాలలో యాంటీబాడీలు విటమిన్లు నాణ్యమైన ప్రోటీన్లు ఒమేగా త్రీ వంటి బిడ్డ మానసిక వికాసానికి తోడ్పడతాయని ఈ సందర్భంగా తెలియజేశారు గర్భిణిగా ఉన్నప్పుడే తల్లిపాలు పట్టే విధానం గురించి గర్భవతులకు తెలియజేయాలని ఏఎన్ఎం లకు మరియు ఆశలకు సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డేకే కాదు తల్లి కి కూడా మేలు చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, మాస్ మీడియా అధికారి కే శ్రీనివాసులు, డి పి హెచ్ ఎన్ ఓ మన్మథమ్మ మరియు వైద్యాధికారులు సూపర్వైజర్లు ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మరొకరు బలి

**- అప్పులు చేసి తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య**



**హైదరాబాద్,ఆగస్ట్5( వెలుతురు):**
ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బెట్టింగ్ గేమ్స్ ఆడకుండా ఉండలేక.. అప్పులు తీర్చలేక ప్రాణాలను తీసుకుంటున్నట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నరేశ్.. భార్య కీర్తి, కుమార్తె భవ్యతో కలిసి వనస్థలిపురంలోని ఓ కాలనీలో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై ఆర్థికంగా నష్టపోయిన నరేశ్.. సుమారు రూ.15లక్షలు అప్పు చేసినట్లు– సమాచారం. ఇటీవల అనారోగ్యంతో ఇంట్లో ఉంటున్న నరేశ్.. అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# గ్రామాలలో అన్ని అభివృద్ధి పనులు కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే జరుగుతున్నాయి

**రానున్న స్థానిక ఎన్నికలలో బిజెపి సర్పంచులను, ఎంపీటీసీ, జడ్పీటీసీ లను గెలిపించాలి**

**యాచారం వెలుతురు ఆగస్టు 05:**
బిజెపి మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా, ఇంటింటికి బిజెపి, ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు కార్యక్రమం 2 వ రోజు నందివనపర్తి గ్రామం లో నిర్వహించడం జరిగింది, 30,31,32,33 బూత్ అధ్యక్షులు భద్రమోని సురేష్, ఏడ్ల శ్రీకాంత్, పంతం మధుకర్ గజ్జ మధుకర్, ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమనికి ముఖ్య అతిధులగా వచ్చిన బిజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మండల ఎన్నికల ప్రభారీ బోసుపల్లి ప్రతాప్, బిజెపి సీనియర్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మండల ఎన్నికల కన్వీనర్ మేకల యాదగిరి రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు నరెడ్ల వెంకట్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు తాండ్ర రవీందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగికర్ రమేష్, నల్లవెల్లి మాజీ సర్పంచ్ దేరంగుల



రాజు, నంది వనపర్తి మాజీ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్, బీజేపీ ప్రధాన కార్యదర్శి కొండూరు రామనాధం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి కొండాపురం నాగరాజు, కొండాపురం బాలరాజు కలిసి ఇల్లు ఇల్లు తిరిగి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు, ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న బోసుపల్లి ప్రతాప్, మర్రిపల్లి అంజయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామాలలో అన్ని అభివృద్ధి పనులు కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే జరుగుతున్నాయని ఇంకా గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రానున్న స్థానిక ఎన్నికలలో బిజెపి సర్పంచులను, బిజెపి ఎంపీటీసీ గెలిపించాలని కోరారు తరువాత గ్రామాలలో నరేంద్ర మోడీ నిధులతో జరిగిన అభివృద్ధి పనులకు సంబందించిన కరపత్రాలు ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాయిని పాండు రంగారెడ్డి, పుప్పాల శాంతి కుమార్, మారగోని శేఖర్, ధోని దేవరకొండ ఈశ్వర్,కుంచారం సందీప్ రెడ్డి, జపాలా శ్రీనివాస్,యాదగిరి, పంభాల శివాజీ,ఒంగూరి సాయికుమార్, సామ సంతోష్, జెనిగా నందు, కొండాపురం రమేష్, ఒంగూరి శ్రీకాంత్, సామ పవన్ మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు



## కొమ్మయగూడెం గ్రామంలో బిజెపి సంపర్క్ అభియాన్ కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 05**

కొమ్మయగూడెం గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో 40, 41వ బూతులలో సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపగడపకు వెళ్లి బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్నటువంటి సంక్షేమ పథకాల గురించి వారికి వివరించడం జరిగింది. పథకాలు అందుతున్నయా లేదా తెలుసుకొని నరేంద్ర మోడీ కి మద్దతుగా మిస్డ్ కాల్ ఇప్పివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఇంచార్జ్ నకరికంటి మొగులయ్య. మండల ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల ఇన్చార్జ్ తాటిపాముల శివకృష్ణ. స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య. బిజెపి సీనియర్ నాయకులు బెల్లి లింగస్వామి, గోపగోని అశోక్, రేపాక లింగస్వామి, మచ్చ మహేష్, ఐలాపురం అశోక్, గురజాల నవీన్ రెడ్డి, మోరే రాజయ్య, వీరమల్ల వీరేష్, డాకోజి నాగరాజు, కంచి రమేష్, తీర్పాల మల్లేష్, వీరమల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఎన్ అశోక్ ని పరామర్శించిన ప్రొఫెసర్ ముత్తయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 05**

ఇటీవల డాక్టర్ ఎన్ అశోక్ తండ్రి మరణించిన విషయం తెలుసుకొని తన గురువు ఉస్మానియా విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం మాజీ అధ్యక్షులు. ప్రొఫెసర్ ముత్తయ్య వెల్లంకి గ్రామానికి వచ్చి అశోక్ కుటుంబ సభ్యులను పలకరించి, తన తండ్రి అయిన ఎర్రోళ్ల మల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ జెడ్పిటిసి సందెల సుధాకర్. బిజెపి రాష్ట్ర నాయకులు కాసర్ల లింగం. ఎర్రోళ్ల యాదయ్య, ఎర్రోళ్ల నరసింహ,పోలేపాక కృష్ణ, ఐతపకా సత్తయ్య, వర్కలా రాము తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ వ్యాఖ్యలు సమర్థనీయమే

**- ఇండియా కూటమి పార్టీల మద్దతు**

**న్యూఢిల్లీ,ఆగస్ట్5( వెలుతురు):**

భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సైన్యంపై అనుచిత వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు సోమవారం మందలించింది. అయితే రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నిరాధారణమైనవని, రాహుల్ వ్యాఖ్యలు సరైనవేనంటూ ఇండియా కూటమిలోని పలు పార్టీలు అభిప్రాయపడ్డాయి. జాతీయ అంశాలను ప్రశ్నించే బాధ్యత రాజకీయ పార్టీలకు ఉంటుందని నొక్కి చెప్పాయి. ఈ అంశంపై ఇండియా కూటమిలోని పలు పార్టీలకు చెందిన సభాపక్ష నేతలు సమావేశమై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా న్యాయస్థానం అసాధారణమైన వ్యాఖ్యలు చేసింది. దీన్ని అన్ని పార్టీల నేతలూ అంగీకరించారు.

## ఈనెల 20,21న రామన్నపేటలో జరిగే ప్రజానాట్యమండలి జిల్లా జానపద-వీధినాటకోత్సవాల ను జయప్రదం చేయండి.

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు.

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 05**

ఆగస్టు 20,21 రామన్నపేటలో జరిగే ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి జానపద- వీధి నాటకోత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ,జానపద-వీధి నాటకోత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. స్థానిక కే.జే భవన్ లో ప్రజానాట్యమండలి కళాకారులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించి, అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజా కళలు పోరాట ఆయుధాలని అనేక ఉద్యమాలకు కళా కారులే ముందుండి నడిపించడం జరిగిందని, అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రామన్నపేటలో గ్రామీణ కళాకారులను జిల్లా వ్యాప్తంగా అనేక మందిని ఏకం చేసి జానపద జాతర నిర్వహించడం జరుగుతుందని,జానపద వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గ్రామీణ కళాకారులకు కనీసం గుర్తింపు లేదని వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డుల అందించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వస్తున్న పాశ్చాత్య విష సంస్కృతి మూలంగా గ్రామీణ కళలు పట్టుతప్పుతున్నాయని. విష సంస్కృతి నేటి యువత మెదళ్ళను కబలిస్తుందని వాపోయారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జానపద వృత్తి



కళాకారులు 20, 21 తేదీల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జానపద వీధి నాటకోత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు కూరెళ్ళ నరసింహాచారి,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటెపాక శివకుమార్,ఈర్లపల్లి ముత్యాలు,ప్రజానాట్యమండలి సీనియర్ నాయకుడు కందుల హనుమంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య, ప్రజాసంఘాల నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, బల్గూరి అంజయ్య,వనం ఉపేందర్, బోయిని ఆనంద్,కల్లూరి నాగేష్, గొరిగి సోములు, తొలుపునూరి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి మండల అధ్యక్ష,కార్యదర్శులు మేడి పృథ్వి, గంటపాక శ్రీకృష్ణ, నాగటి లక్ష్మణ్,మేడి ముకుంద, మునికుంట్ల లెనిన్, సాగర్ల శేఖర్, తుర్కపల్లి నరేష్, మజ్జుర్ సాయి, పుట్టల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మునిపంపుల ప్రభుత్వ ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చాలి.

**- ఆశ వర్కర్ల సమావేశానికి షెడ్డు ఏర్పాటు చేయాలి.**

**- ఆసుపత్రిలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి.**

**- సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యురాలు జంపాల అండాలు.**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 05**

మునిపంపుల ప్రభుత్వ సుపత్రిలో 24 గంటల వైద్య సౌకర్యం అందేలా చేసి పరిసర గ్రామాల గర్భిణీ స్త్రీల ప్రయోజనార్థం గైనకాలజిస్టును నియమించి వైద్య సౌకర్యం అందించాలని సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యురాలు జంపాల అండాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ మహిళా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం ఏర్పడిన ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్య సౌకర్యం లేక పరిసర గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సుమారుగా 14 గ్రామాలకు కేంద్రమైన ప్రభుత్వాసుపత్రిలో ఒకే డాక్టరు ఉండడంతో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. మండల కేంద్రం దూరంగా ఉండడంతో అత్యవసర వైద్యం కలిగినప్పుడు రాత్రిపూట ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక ఫర్నిచర్ వంటివి



కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని, డాక్టర్ సొంత డబ్బులతో ఖర్చు పెట్టి కొనుక్కుంటున్నామని సమాధానం ఇస్తున్నారని అన్నారు. ప్రతి నెల ఆశా వర్కర్లు సమావేశం జరుపుతారు కనీసం కూర్చోవడానికి షెడ్డు లేకపోవడంతో చెట్ల కిందే కాలమెల్ల తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఖాళీగా ఉన్న నర్సు పోస్టును భర్తీచేయాలని, డాక్టర్లు నిరంతరం స్థానికంగా ఉండాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మహిళా శాఖ నాయకులు తాళ్లపల్లి హేమలత,బొడ్డుపల్లి సంధ్య, కుక్కడపు ఎల్లమ్మ, అప్పం విజయ,గంటెపాక అశ్విని, బోనగిరి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు పిల్లల ఫీజు రాయితీపై కలెక్టర్ లేఖ..

**- సంఘం నేత శ్రీనివాస్ కు అందజేసిన డీఈవో**

**- జిల్లా పాలనాధికారికి,డీఈవోకు కృతజ్ఞతలు**

**- సాకులు చెప్పొద్దని ఆదేశాలు ఇవ్వాలి..**

**- టీపడబ్ల్యుజె(ఐజేయు) జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్**

**నెల్లికుదురు / ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 5:**

మానుకోట జిల్లాలోని జర్నలిస్టు ల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థలలో ఫీజు రాయితీపై జిల్లా కలెక్టర్ అద్వైత కుమార సింగ్ జర్నలిస్టులకు లేఖ రాశారు. సంబంధిత లేఖను డీఈవో రవీందర్ రెడ్డి మంగళవారం తన ఛాంబర్ లో టీయూడబ్ల్యూజే(ఐజేయు)జర్నలిస్ట్ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్ కు అందజేశారు.జర్నలిస్ట్ ల విజ్ఞప్తికి స్పందించి రాయితీ లేఖను అందజేసిన జిల్లాకలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కు,డిఇఓ రవీందర్ రెడ్డి కి ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ తనతోపాటు జర్నలిస్టుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాలల యాజమాన్యాలు ఎక్కడైనా ఇబ్బంది పెట్టినా..జర్నలిస్ట్ ల పిల్లలకు



ఫీజురాయితీ ఇవ్వడానికి నిరాకరించినా,సాకులు చెప్పినా జర్నలిస్ట్ ల పక్షాన సహాయం చేయాలని, విద్యాలయాల వారికి మౌఖిక ఆదేశాలు ఇవ్వాలని డీఈవో రవీందర్ రెడ్డి ని కోరారు.అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రయివేట్ పాఠశాలలకు, పాత్రికేయులకు మధ్య స్నేహపూరిత వాతావరణం కొనసాగేలా జర్నలిస్ట్ లకు ఫీజురాయితీ ఇచ్చి సహకరించాలని అన్ని ప్రయివేట్ విద్యాసంస్థలకు విజ్ఞప్తి చేశారు.

## పిఆర్టీయు సభ్యత్వ నమోదు..



**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 5:**

మానుకోట జిల్లా ఇనుగుర్తి హై స్కూల్లో పి ఆర్ టి యు మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ మండలాధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పట్ల పోరాడుతూ పరిష్కరించడంలో పిఆర్టియుటీఎస్ ముందుంటుందన్నారు.సిపిఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన మహా ధర్నా విజయవంతంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. పెండింగ్ బిల్లులన్నీ ఈ నెల 15 లోపు పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం అమ్మ యాకయ్య,రమేష్,వీరన్న,దేవేందర్,రాములు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## లైబ్రరీ బుక్స్ సద్వినియోగం చేసుకోవాలి..

- ఎంఇఓ రాందాస్.



**నెల్లికుదురు వెలుతురు ఆగస్టు 5:**

ప్రభుత్వం సరఫరా చేసిన గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాందాస్ సూచించారు.మండలంలోని వివిధ పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలను స్థానిక ఎమ్మార్సీ భవనంలో మంగళవారం ఎంఈఓ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని 48 ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్ఎం లకు బుక్స్ అందజేశామని తెలిపారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ మస్కపురి సుధాకర్,కంప్యూటర్ ఆపరేటర్ హెచ్ ఉపేందర్,సి ఆర్ పి లు భాస్కరరావు,బి వీరస్వామి,జె కవిత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రేషన్ కార్డులు పంపిణీ..

- జిల్లా నేత అశోక్ గౌడ్



**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 5:**

కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పేదలకు రేషన్ కార్డులు, ఇద్దరమ్మ ఇండ్లు మంజూరవుతున్నాయని ఆ పార్టీ జిల్లా నేత బైరు అశోక్ గౌడ్ అన్నారు.మండలంలోని చిన్ననాగారంలో లబ్ధిదారులకు రేషన్ కార్డు పత్రాలు మంగళవారం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సతీష్ చారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు కేవలం ఆహార భద్రతకే కాదని పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు.కార్యక్రమంలో నాయకులు కొయ్యడి యాకాంతం గౌడ్,బైరు శ్రీనివాస్ గౌడ్, దాసరి ప్రకాష్,పోలోజు సోమయాచారి,బొమ్మెర రమేష్,బండారు జంపయ్య గౌడ్, ఉడుత కొమరుమల్లు యాదవ్,బైరు వేణు గౌడ్,బొమ్మెర లచ్చయ్య గౌడ్,గుండ్ల యాకయ్య, దాసరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణి..



**ఇనుగుర్తి వెలుతురు ఆగస్టు 5:**

మానుకోట జిల్లా ఇనుగుర్తి మండలం అయ్యగారి పల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు కేసముద్రం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం దుస్తులు,పాదరక్షలు, గ్లౌజులు పంపిణీ చేశారు.క్లబ్ అధ్యక్షులు మామిడి అశోక్ సహకారంతో రిటైర్డ్ ఎంఆర్ఓ జోనల్ చైర్మన్ మాధవ పెద్ది వెంకటరెడ్డి సమక్షంలో కార్మికులకు అందజేశారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బొమ్మెర వాణి,లయన్స్ ప్రతినిధులు డా.చంద్రశేఖర్, ఎర్నం శ్రీరాములు,డా.మోహన్ నాయక్,రాపోల్ శ్రీనివాస్, రుద్ర శ్రీకాంత్,ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మడిపెద్ది వెంకటేష్, మామిడిసోమయ్య, సిబ్బంది అఖిల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మునిగలవీడు స్కూల్లో బోనాల సంబురాలు..

**నెల్లికుదురు వెలుతురు ఆగస్టు 5:**



శ్రావణమాసంలో గ్రామ గ్రామాన నిర్వహిస్తున్న బోనాల పండుగ పురస్కరించుకుని ముందస్తుగా మంగళవారం మానుకోట జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు టీచర్స్ సహకారంతో బోనాల పండుగ సంబురాలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్టూడెంట్స్ శివశక్తుల వేషధారణ పూనకాల మధ్య బోనాలను ఎత్తుకొని బోనాల పండుగ నిర్వహించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.రవీందర్,సిపిఎం మండల కార్యదర్శి సంపెల్లి సైదులు,ఉపాధ్యాయులు సుధాకర్,యుగంధర్,వెంకటయ్య మధు,గ్రామస్తులు సంగీత పవన్,విద్యార్థులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం మిషన్ కాకతీయ అని చెప్పి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది

**- కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనిచేసే వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు**

**- గ్రౌండ్ లెవెల్ లో మిషన్ కాకతీయ పనులు సక్సెస్ కాలేదు**

**- చెరువుల పునర్నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలి**

**- చెరువులను అభివృద్ధి చేసుకునే బాధ్యత గ్రామస్తులకు అప్పగిస్తాం**

**- కబ్జాకు గురైన చెరువులను సర్వే చేసి హద్దులను ఫిక్స్ చేయాలని ఆర్డీవోకు ఆదేశం**

**- మార్నింగ్ వాక్ లో చెరువుల పరిశీలనలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**



**మునుగోడు వెలుతురు ఆగస్టు 05:**

నీరు సకల కోటి ప్రాణాలకు జీవనాధారమని మనిషి జీవన విధానం చెరువుల చుట్టూ అల్లుకుని ఉందని అన్నారు, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మంగళవారం రోజున ఉదయం మునుగోడు మండలంలోని సోలిపురం లో సమస్యలు తెలుసుకోవడానికి మార్నింగ్ వాక్ చేశారు. కబ్జాలకు గురైన సోలిపురం చెరువును పరిశీలించారు.. మునుగోడు నియోజకవర్గంలో వర్షపు నీటి పైన ఆధారపడి రైతాంగం వ్యవసాయం చేసుకుంటారని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచుకోవడానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను అభివృద్ధి చేసుకోవలసి ఉందన్నారు... గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరు మీద వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టినప్పటికీ కాంట్రాక్టర్లు తూతు మంత్రంగా పైపైనే పనులు చేసి వెలకోట రూపాయలు దండుకున్నారని, గ్రౌండ్ లెవెల్ లో మిషన్ కాకతీయ పనులు సక్సెస్ కాలేదన్నారు. ప్రతి చినుకుని ఒడిసి పట్టుకొని చెరువులు నిండేలా చేసుకుంటే నిండిన చెరువు ద్వారా మూడు నాలుగు సంవత్సరాల వరకు వ్యవసాయం చేసుకోవచ్చని, చెరువులు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అన్నారు. కబ్జాకు గురైన



చెరువు భూములను సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా చెరువుల పునర్నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. చెరువులను అభివృద్ధి చేసుకునే బాధ్యత గ్రామస్తులకే అప్పగిస్తామని చెరువుల పూడిక మట్టి తీయడం కట్టను పటిష్టం చేయడం అలుగుల మరమ్మత్తులు చేయడం వల్ల వ్యవసాయానికి దన్నుగా ఉంటుందన్నారు... పూడిక మట్టిని రైతులు తీసుకెళ్లి తమ పొలాలలో చల్లుకునే విధంగా అనుమతులు ఇవ్వాలని అధికారులకు చెప్పారు.. మార్నింగ్ వాక్ లో గ్రామంలోని పలు సమస్యలను గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అన్నింటిని విడతల వారీగా పరిష్కరిస్తామన్నారు.. సోలిపురం వాగు పై నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించిన ఆయన గ్రామాల్లోని చిన్నచిన్న సమస్యలకు ప్రతిసారి పోలీస్ స్టేషన్లకు వెళ్ళొద్దని , గ్రామ పెద్దలందరూ కూర్చొని మాట్లాడి సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని గ్రామస్తులకు సూచించారు... మనం బ్రతకాలి మన చుట్టూ ఉన్న వాళ్ళు కూడా బ్రతకాలని ఆలోచనతో ప్రతి ఒక్కరూ జీవన విధానాన్ని కొనసాగించాలన్నారు.. ప్రతి చిన్న విషయానికి పోలీస్ స్టేషన్లో చుట్టూ తిరగడం వల్ల సమయం ఖర్చు వృధా అవుతుందన్నారు. గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా చెరువుల పునర్నిర్మాణ యజ్ఞంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.. ఈ పర్యటనలో మునుగోడు మండల నాయకులతోపాటు చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు ఇన్చార్జి తహసిల్దార్ నరేష్, ఇంచార్జ్ ఎంపీడీవో విజయభాస్కర్, పంచాయతీరాజ్ ఏఈ సతీష్ రెడ్డి, సర్వేయర్ నాగేశ్వరరావు లు పాల్గొన్నారు..

# రౌడీ షీటర్లు సమాజ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనొద్దు...!

- జహీరాబాద్ పట్టణంలోని 15 మంది రౌడీలకు కౌన్సిలింగ్....
- పట్టణ సబ్ ఇన్స్ పెక్టర్ వినయ్ కుమార్ హెచ్చరిక...



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 05:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని 15 మంది రౌడీలు, కమ్యునల్ రౌడీలకు మంగళవారం నాడు పట్టణ పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ అధికారి వినయ్ కుమార్ కౌన్సిలింగ్ ఇచ్చారు. పట్టణంలో ఎలాంటి వ్యవహారాల్లో జోక్యం కానీ తలదూర్చడం కానీ చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని, విధిగా పోలీసులు ఇచ్చిన సూచనలను పాటించాలని, గోడవల్లో, సెటిల్ మెంట్లలో జోక్యం చేసుకొంటే చట్టపరంగా న్యాయ స్థానం ముందు నిలబెట్టి కఠిన చర్యల గురయ్యే విధంగా చర్యలు ఉంటాయన్నారు. కమ్యునల్ రౌడీలు కూడా ఎలాంటి రెచ్చగొట్టే పనులు చేసిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. ప్రతి కార్యం మీద పోలీసుల నిఘా ఉంటుందని, ఎలాంటి కదలికలకు పాల్పడ్డ గుర్తించి చర్యలు తీసుకోబడతారని హెచ్చరించారు.

## అంగరంగ వైభవంగా అచ్చంపేట గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ పోచమ్మతల్లికి బోనాలతో నైవేద్యం సమర్పించిన భక్తులు



**వెలుతురు న్యూస్, అచ్చంపేట ఆగష్టు 5:**

నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నగరంలో గ్రామ దేవత అయిన శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి అమ్మవారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. నగరవాసులు అమ్మవారి బోనాల పండుగ అంగ రంగా వైభవంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్ళు ఆడపడుచులు బంధుమిత్రులతో కలిసి వచ్చి భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి ఆలయం దగ్గరకు చేరుకొని అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## వర్షాలకు ఇల్లు కూలిన బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్





**పటాన్‌చెరు వెలుతురు ఆగష్టు 05:**

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాత రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన సురేష్ నివసిస్తున్న ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఈ దుర్ఘటనలో ఆయన తల్లి మరియు కూతురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఇలాంటి కష్టకాలాల్లో బాధిత కుటుంబానికి అండగా ఉండడం మన బాధ్యత అన్నారు. అదేవిదంగా ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా చూస్తామని, సంబంధిత అధికారులను కూడా అప్రమత్తం చేస్తామని కాట సుధా శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు.

## విద్యుత్ తీగ పడి యువరైతు దుర్మరణం

**భద్రాద్రి కొత్తగూడెం,ఆగష్టు 5( వెలుతురు):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో విషాదం చోటుచేసుకుంది. ఓ యువకుడు పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో వాహనంతో సహా దగ్ధమై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందు గ్రామానికి చెందిన పర్సిక రాజు(35) అనే వ్యక్తి తన బైక్ వెళ్తుండగా గ్రామ శివారులో అతడిపై విద్యుత్ తీగ పడింది. బైక్ తో సహా అతడు కాలిపోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శవ పరీక్ష నిమిత్తం గుండాల ప్రభుత్వాస్త్రికి తరలించారు. మంటల్లో కాలిపోతున్న యువకుడిని చూసి కుటుంబ సభ్యులు, బంధువుల బాధపడే తీరు అందరినీ కలిచి వేసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియా వైరల్ గా మారింది.

## వ్యక్తి ఇంట్లో బుల్లెట్, గంజాయి స్వాధీనం

**హైదరాబాద్,ఆగష్టు 5( వెలుతురు):**

మీర్‌పేట్‌లోని ఓ ఇంట్లో తుపాకీ బుల్లెట్ కలకలం సృష్టించింది. ఓ యువకుడి దగ్గర బుల్లెట్లతో పాటు గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీర్‌పేట్‌లోని ఎస్ఎల్ఎన్ ఎస్ కాలనీలో చంద్రశేఖర్ అనే వ్యక్తి రెండేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. హైదరాబాద్ లోని పలు ప్రాంతాలలో దొంగతనం చేసి అద్దె ఇంట్లో తలదాచుకుంటున్నాడు. పోలీసులు చంద్రశేఖర్ అరెస్ట్ చేసి బుల్లెట్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# డబుల్ బెడ్ రూం అప్పగించకుంటే మేమే ఒళ్ళలోకి వెళ్లుతాం...లబ్ధిదారుల హెచ్చరిక

- ఈ నెల 13న ఇస్తామన్న తహసిల్దార్ దశరథ్...
- ఆందోళన విరమణ, సంతోషం వ్యక్తం చేసిన పేదలు...
- ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ చుక్క రాములు...







**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 05:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి సంవత్సరాలు గడుస్తున్న లబ్ధిదారులకు ఇవ్వకపోవడం సరైనది కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. పట్టాలు ఇచ్చినా తాళాలు ఇవ్వలేదని, సిపిఎం ఆందోళన ఫలితంగా అధికారులు ముందుకు వచ్చి ఈనెల 13న ఇస్తామన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే ఇళ్ల తాళాలు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే లబ్ధిదారులు ఇళ్లలోకి వెళతారన్నారు. ఈసారి అధికారులు చొరవ తీసుకోవాలని పేదల పట్ల ఈ ప్రభుత్వానికి ఇంత కఠినంగా వ్యవహరించడం సరైనది కాదని వారన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ తాళాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఈరోజు లబ్ధిదారులు ఆందోళనకు దిగడానికి ప్రయత్నించగా ఈరోజు పోలీసులు రెవెన్యూ అధికారులు చర్చలకు ఆహ్వానించి కలెక్టర్ ఆర్డర్ ఇచ్చారని, 13వ తేదీన తాళాలు ఇస్తామని తహశీల్దార్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ కలెక్టర్ ఇచ్చిన ఆర్డర్ ను సిపిఎం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కారాములు మాట్లాడుతూ పేదలైన లబ్ధిదారులకు గత ప్రభుత్వం ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లకు ఈరోజు వరకు కూడా ఇళ్ళ తాళాలు అప్పజెప్పక పోవడం సరైనది కాదని, పైగా పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు పేదలు పోరాడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. పోరాడితే తప్ప సమస్యలు పరిష్కరించరా అని ప్రశ్నించారు. ఈసారి కూడా అధికారులు, ప్రభుత్వం మాట తప్పి తాళాలు 13న ఇవ్వకపోతే లబ్ధిదారులే ఆక్రమించి వెళతారని కాపురాలు ఉంటారని అన్నారు. తాళాలు ఇచ్చేవరకు సిపిఎం ఎర్రజెండా అండగా ఉంటుందని పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు. లబ్ధిదారుల పట్టా సర్టిఫికెట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజు, ఏరియా కార్యదర్శి బి.రాంచందర్, ఏరియా కమిటీ సభ్యులు మహిపాల్, నాయకులు ముతబీర్, రాజిరెడ్డి, బక్కన్న, బాల్ రాజ్, సీఐటీయూ నాయకులు నరేష్, వంశీ, కిరణ్, సాయి గౌడ్, బాబు తదితరులున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- రోజు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలి...
- డాక్టర్లు సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలి...
- డయాలసిస్ మిషన్స్ పెంచాలి...
- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరిండెంట్ కు వినతి...



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 05:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సీటి స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయాలనీ డివైఎఫ్ఐ జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు, కార్యదర్శులు దుర్గా ప్రసాద్, శ్రీకాంత్ లు డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ....రోజు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలని, రోజూ డాక్టర్స్ అందుబాటులో ఉండాలనీ, దయాలసిస్ మిషన్స్ పెంచాలని, అనేక సమస్య లు హస్పెటల్ లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని సమస్యలు డివైఎఫ్ఐ వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరిండెంట్ కు వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ ఆసుపత్రిలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో ప్రజల ద్వారా రోగుల ద్వారా అనేక రకాల సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ సర్వేలో వచ్చిన సమస్యలను వెంటనే పరీక్షించి పరిష్కరించాలన్నారు. సమస్యలతో రోగులు ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులు గురవుతున్నారని తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను కూడా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. హస్పెటల్ లో సీటి స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయాలని, రోజు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలి, డయాలసిస్ మిషన్స్ పెంచాలని, డాక్టర్లు సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలన్నారు. పై సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేని ఎడల పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సాయికిరణ్ గౌడ్, కోటేశ్వర్ రెడ్డి, పులేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు 13 న తాళాలు అందించే నిర్ణయంపై హర్షం...
- పార్లమెంట్ ఇంచార్జ్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి...



**జహీరాబాద్ వెలుతురు ఆగష్టు 05:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హెూతి కె లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు మానవతా దృక్పథంతో కాంగ్రెస్ ప్రభుత్వం యధావిధిగా ఈ నెల 13 వ తేదీన తాళం అందించనుందని జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ గంకటి శుక్లవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం స్వాతంత్రం నాటి నుంచి ఇప్పటివరకు కూడా నిరుపేదలకు న్యాయం చేసే లక్ష్యంతోనే పని చేసిందని, భవిషత్తులో కూడా అదే లక్ష్యంతో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇచ్చిన లబ్ధిదారులకు అన్యాయం జరుగొద్దనే ఉద్దేశంతో యధావిధిగా ఇళ్లను వారికే కేటాయించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర వైద్య మంత్రి దామోదర్ రాజనర్సింహ, పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ డా చంద్రశేఖర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో అండగా నిలిచి నిర్మాణం సహాయంగా 5 లక్షల నిధులను లబ్ధిదారులకు ఇస్తుందని శుక్లవర్ధన్ రెడ్డి అన్నారు.

## బావిలో దూకి కుటుంబం ఆతహ్మాహత్య

**వికారాబాద్,ఆగస్టు 5( వెలుతురు):**

వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలంలో ఓ విషాదం చోటు–చేసుకుంది. చీమల్ దరి వద్ద అన్నా, చెల్లెలు బావిలో దూకి చనిపోయారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... చీమల్ దరి గ్రామంలోని ఓ వెంచర్ లో దంపతులు పని చేస్తున్నారు. దంపతుల మధ్య జరిగిన గొడవ తారాస్థాయికి చేరుకుంది. భర్తతో గొడవపడిన భార్య అలివేలు మనస్థాపానికి చెంది బావిలో దూకింది. భార్యను రక్షించాలని వెంటనే భర్త మాసయ్య బావిలో దూకాడు. అన్న, వదినను మునిగిపోవటం చూసి వారిని రక్షించేందుకు చెల్లెలు నాగమ్మ బావిలో దూకింది. బావిలో పడిన ముగ్గురిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. మొదట బావిలో దూకిన భార్య అలివేలు పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మాసయ్య, చెల్లెలు నాగమ్మ మృతి చెందారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నగరంలో మరోమారు భారీ వర్షం

- బంజారాహిల్స్, కూకట్‌పల్లిలో కుంగిన రోడ్లు



**హైదరాబాద్,ఆగస్టు 5( వెలుతురు):**

హైదరాబాద్ నగరంలో పలు చోట్ల మరోమారు భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్ లో రోడ్డు కుంగింది. అకస్మాత్తుగా రోడ్డు కుంగడంతో అటుగా వస్తున్న నీటి ట్యాంకర్ అందులో పడిపోయింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్‌తోపాటు– క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షం కారణంగానే రోడ్డు కుంగినట్లు అధికారులు చెబుతున్నారు. కుంగిన చోట రోడ్డు కింద నాలా పైప్‌లైన్ ఉన్నట్లు– గుర్తించారు. రహదారి కుంగడంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాన్ని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ముస్లిం గ్రేవ్ యార్డ్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌తో పాటు రోడ్డు కుంగింది. దీంతో రహదారిపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అదే రహదారిపై ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఫలితంగా స్టేషన్ నుంచి వై జంక్షన్ వరకు మురుగు నీరు ప్రవహిస్తోంది.

# గ్రామీణ వికాసం బిజెపితోనే సాధ్యం...

- కాంగ్రెస్ ప్రభుత్వంతో తెలంగాణలో మార్పు రాలే, బతుకులు మారలే.
- బిజెపి నేతలు నరహరి లక్ష్మారెడ్డి, బొంతల కళ్యాణ్ చంద్ర







**తిమ్మాపూర్ వెలుతురు ఆగష్టు 05:**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని , గ్రామీణ వికాసం బిజెపితోనే సాధ్యమని బిజెపి తిమ్మాపూర్ మండల ఇన్చార్జ్ నరహరి లక్ష్మారెడ్డి , బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, జడ్పిటిసి ఎన్నికల కన్వీనర్ బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి, రేణిగుంట గ్రామంలో హర్ ఘర్ బిజెపి (ఇంటింటికి బిజెపి ) ప్రోగ్రామ్ శక్తి కేంద్ర ఇన్చార్జి గడ్డం అరుణ్ ఆధ్వర్యంలో జరిగింది. ఇట్టి ప్రోగ్రాంకు ముఖ్య అతిథులుగా హాజరైన నరహరి లక్ష్మారెడ్డి, బొంతల కళ్యాణ్ చంద్ర లు ఇంటింటికి పంపిణీ చేసే బిజెపి కరపత్రాన్ని ఆవిష్కరించి కొత్తపల్లి, రేణిగుంటలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో



గ్రామాల ముఖచిత్రాన్ని మార్చిందన్నారు. గ్రామీణ రహదారులు, మురికి కాలువలు, స్మశాన వాటికలు, వీధి దీపాలు , ఇళ్లకు మంచినీటి సరఫరా,, మరుగుదొడ్ల నిర్మాణం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల జీవనోపాధి మెరుగుపరచడం కోసం మోడీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఉచిత బియ్యాన్ని పంపిణీ చేసి అందరి ఆకలి తీరుస్తుంది బిజెపి యే అన్నారు. అన్నదాతకు అండగా మోడీ ప్రభుత్వం నిలిచిందని, అన్నదాతపై ఎరువుల భారం తీరుస్తూ సబ్సిడీలను అందిస్తుందని, పండించిన ప్రతి గింజనుకుంటూ, గిట్టుబాటు ధర కల్పించిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అలాగే కట్టెల పొయ్యి నుండి మహిళలకు విముక్తి కల్పిస్తూ ఉజ్వల యోజనతో గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తుంది మోడీ ప్రభుత్వమేనన్నారు. ముఖ్యంగా యువత భవిత కోసం బిజెపి బాటలు వేసిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ప్రధానంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో మార్పు పేరుతో తెలంగాణ ప్రజలను దారుణంగా కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. తెలంగాణలో 10 ఏళ్ల బిఆర్ఎస్ అరాచక పాలనకు కొనసాగింపుగా కాంగ్రెస్ పాలన ఉందని ఘాటుగా విమర్శించారు. నెరవేర్చని హామీలు, గ్యారంటీలు, అవినీతి విధానాలు, అసమర్థ పాలన, అస్తవ్యస్త ఆర్థిక విధానాలు, పేదలు , అన్నగారిన వర్గాల పట్ల కాంగ్రెస్ సర్కార్ పాలనలో కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టుముక్కల తిరుపతి రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్, ఓ బి సి మోర్చా అధ్యక్షులు దురిశెట్టి రమేష్, ఉపాధ్యక్షులు తమ్మనవేని రాజుయాదవ్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కొయ్యడ.శ్రీనివాస్, మండల కార్యదర్శి పడాల శ్రీనివాస్ అన్నాడి రమణారెడ్డి బూత్ అధ్యక్షులు సుద్దాల సతీష్, కాల్వ శ్రీనివాస్, జంగా సునీల్ రెడ్డి మరియు కుంభం శ్రీనివాస్,గడ్డం లక్ష్మణ్, పిట్టల మహేష్, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు చేరువలో పాఠశాల ఏర్పాటుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 05**

ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు చేరువలో పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మరమ్మత్తులు అవసరం కలిగిన పాఠశాల భవనాలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టి పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో రామ్ నగర్ లో గతంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలమైనందున, స్థానిక విద్యార్థులకు విద్యను అందించేందుకు నూతనంగా పాఠశాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా డీజిల్ నిల్వ చేయడంపై 6ఎ కేసు నమోదు

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 05**

సరైన అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ నిల్వ చేయడంపై 6ఎ కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య తెలిపారు. మంగళవారం తనిఖీలలో భాగంగా జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామం పరిధిలోని రొమ్మిపూర్ ఆమ్లెట్ గ్రామంలో సరైన అనుమతులు లేకుండా అక్రమంగా డీజిల్ నిల్వ చేసిన మెగా ఇంజనీరింగ్ %డ% ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డీజిల్ బంక్ పై 6ఎ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డీజిల్ బంక్ వారు ఫామ్ - బి అనుమతి లేకుండా అక్రమంగా 8 వేల 141 లీటర్ల డీజిల్ ట్యాంకులలో నిలువ చేశారని, తెలంగాణ పెట్రోలియం ప్రోడక్ట్ 2016 ప్రకారం ఎవరైనా 2 వేల 500 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్ నిల్వ చేసుకున్నవారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి లైసెన్స్ లేకుండా డీజిల్ నిల్వ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు లైన్ల రహదారిగా విజయవాడ హైవే

**- కేంద్రమంత్రి గడ్కరిని కలిసి కోరిన మంత్రి**

**- తమ్ముడికి మంత్రిపదవి ఇప్పించే స్థాయి కాదన్న కోమటిరెడ్డి**



**న్యూఢిల్లీ,ఆగస్ట్5( వెలుతురు):**

మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంతో పాటు- సర్వీస్ రోడ్లను నిర్మించాలని కేంద్ర గడ్కరీని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికోరారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశ మయ్యారు. వచ్చే వారం ప్రధాన మంత్రితో సమావేశం అవనున్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై గడ్కరీతో సుదీర్ఘంగా చర్చించారు. మంత్రితోపాటు తెలంగాణ ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం గురించి ప్రయత్నాలు చేస్తున్నాం.. ప్లాన్స్ జరుగుతున్నాయన్నారు. పటౌడీ హౌస్ లో రెండు నెలల్లో పనులు మొదలు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో అనుమతుల కోసం కొంత ఆలస్యం అవుతోందన్నారు. రాజగోపాల్ రెడ్డి ఎపిసోడ్ పై మంత్రి స్పందించారు. నేను మా సోదరుడికి మంత్రి పదవి ఇప్పించే స్టేజ్ లో లేను. కేంద్ర పెద్దలు మాటిచ్చిన విషయం నాకు తెలియదు. నా చేతుల్లో ఏం లేదు. అధిష్టానం, ముఖ్యమంత్రి మంత్రి పదవుల విషయంలో నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఢిల్లీకి రాలేదు. మంత్రి పదవి అడగలేదు అని స్పష్టం చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల 30శాతం వేతన పెంపు డిమాండ్‌తో జరుగుతున్న సమ్మె వివాదంపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు బాధ్యతలు అప్పగించినట్లు- ఆయన తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్మికులకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌లో బతకాలంటే జీతాలు పెరగాలి. ఢిల్లీ పర్యటన తర్వాత నేను కార్మికులతో నేరుగా మాట్లాడతాను. ఈ అంశాలన్నిటినీ దిల్ రాజుకు అప్పగించాము. ఆయన ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో చర్చలు జరుపుతున్నారుని వెల్లడించారు. ఆయన మరింత మాట్లాడుతూ, 'పాన్ ఇండియా సినిమాలు తీస్తున్నారు. టికెట్ ధరలు పెంచేందుకు మేము అనుమతులు ఇస్తున్నాము. కాబట్టి, కార్మికులు అడుగుతున్న డిమాండ్లపై చర్చించి, నిర్మాతలు తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 05**

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగా మోహన్ తో కలిసి సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడి ఆరోగ్య కేంద్రంలో పొందుతున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం దృశ్య వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునికరించి ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించి సమయపాలన పాటించాలని తెలిపారు. మండలంలోని మల్లిడి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిరుపేదల కొరకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం



600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకోవాలని, బిల్లులు త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం నిర్వహణను పరిశీలించారు. మొక్కల నిర్వహణ సక్రమంగా లేనందున పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నర్సరీలో మొక్కల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం లో భాగంగా అమలు చేస్తున్న మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం



మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో విద్యార్థినులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసరాలను వినియోగించాలని, సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అంటూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, పరిసరాల పరిశుభ్రత పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థినులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 05**

ప్రజా సంక్షేమం లో భాగంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం లో భాగంగా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి సందర్శించి పాఠశాలలో



విద్యార్థినులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసరాలను వినియోగించాలని, సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారాన్ని అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా అంటూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, పరిసరాల పరిశుభ్రత పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.



ఉపాధ్యాయులు విద్యార్థినులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 10వ తరగతి గదిలో విద్యార్థులను సబ్జెక్టులపై పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భారీగా అవకతవకలు, కుటుంబ సభ్యుల ధనార్జన కోసమే...

**తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని, జనాన్ని నమ్మించి గుంట నక్కలా వేలకోట్లు దోచుకున్న కెసిఆర్**
**- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.**

**కెసిఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేసినందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి కాంగ్రెస్ పార్టీ డిమాండ్...**

**కూకట్ పల్లి ఆగస్ట్ 5 వెలుతురు:**

తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని, జనాన్ని నమ్మించి గుంట నక్కలా వేలకోట్లు కెసిఆర్ దోచుకున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై మంగళవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవకతవకలు జరిగాయని, నాటి ప్రభుత్వ పెద్దలు తీసుకున్న నిర్ణయాల వల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగం అయిందని జస్టిస్ ఘోష్ కమిషన్ నిగ్గుతేలిచిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ నిర్మాణం కేవలం కేసీఆర్ నిర్ణయమే అన్నారు. ముఖ్య మంత్రి , ఉప ముఖ్య మంత్రి చాల స్పష్టంగా సుదీర్ఘమైన ప్రెస్ మీట్ లో తెలంగాణ ప్రజలు అందరికి చాల స్పష్టంగా చెప్పడం జరిగిందని, కాళేశ్వరరావు కేవలం అవినీతి ప్రాజెక్ట్ కెసిఆర్ కుటుంబం కేవలం దోచుకుంది, దాచుకుంది అని మాత్రమే అనుకున్నాం కానీ నిన్న ఆ సమావేశంలో జస్టిస్ ఘోష్ నివేదిక చూసాక, ఈ కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన విధానం ప్రజా జవాబుదారిగా ఉండాల్సిన ముఖ్య



మంత్రి, ఒక ట్రస్టీ గా ఉండాల్సిన ముఖ్య మంత్రి తన ఒంటెద్దు పోకడలతో నియంతృత్వ విధానాలతో నిర్లక్ష్య ధోరణితో ఎన్ని అవలక్షణాలు ఉన్నాయో అన్ని అవలక్షణాలని రాత్రి పూట డైనింగ్ టేబుల్ మీద కూర్చొని వారు తీసుకున్న నిర్ణయాలకు తెలంగాణ రాష్ట్ర ప్రజలకి తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసింది గత పాలకుడు కెసిఆర్ అని స్పష్టం అయిందన్నారు. ఈ కూలి పోయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కి పూర్తీ బాధ్యత తీసుకోవాల్సిందే కెసిఆర్ నే అన్నారు. రేపు కెసిఆర్ అసెంబ్లీ కి వచ్చి బహిరంగంగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. రూ. 38,500 కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్ ను ప్రారంభించి, అంచనా వ్యయాన్ని ఏకంగా రూ. లక్ష 10 వేల 248 కోట్లకు పెంచారని, కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో తీసుకున్న రూ. 87,449.15 కోట్ల రుణాలు రాష్టానికి గుదిబండగా మారాయన్నారు. తెలంగాణ కు కాపలా కుక్కలా ఉంటా అని జనాన్ని నమ్మించి గుంట నక్కలా వేలకోట్లు దోచుకోవడం.. అక్రమ సంపాదన కోసం కాళేశ్వరం కట్టడంతో లక్షల ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం.. ప్రజలను పాలించమని అధికారం ఇస్తే 10 ఏళ్లు ఫాం హౌస్ లో పడుకుని తాను తెలంగాణ ను బంగారు తెలంగాణ చేశా అని ప్రచారం చేసుకోవడం తప్ప చేసింది ఏమి లేదన్నారు. మీది అసమర్థ పాలన అనే మిమ్మల్ని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టిను అని, మీకు బీజేపీతో లోపాయికారి ఒప్పందం ఉండడం వల్లే పదేండ్లలో మీరు ఎన్ని కుంభకోణాలు చేసినా.. మీవైపు సీబీఐ, ఈడీ కన్నెత్తి చూడలే.. రాష్ట్రానికి కేంద్రం పైసా ఇయ్యకున్నా మీరు మూతులు ముడుసుకొని కూసున్నరని, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి మిగులు రాష్ట్ర ఖజానాకు తెగలు పట్టించిను అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో పేద బడుగు బలహీన వర్గాలన్నింటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కవిత బీసీ ధర్నాపెద్ద జోక్ పదేండ్లు ఆమెకు బీసీలు ఎందుకు గుర్తుకు రాలేదన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం, బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు. అమలు పోరాటంలో అందరూ కలిసి రావాలి బీసీ రిజర్వేషన్ల కోసం రాజకీయాలకతీతంగా పోరాడుదాం ముస్లింలను సాకుగా చూపి బీసీ బిల్లుని బీజేపీ అడ్డుకుంటోంది అన్నారు. కేంద్రం పై ఒత్తిడి పెంచేందుకు, కనువిప్పు కలిగేలా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్నాం అన్నారు.

## మరుభూమిని తలపిస్తున్న ధరాలి గ్రామం

**- సహాయక చర్యలకు రంగంలోకి దిగిన ఆర్మీ**

**డెహ్రాడూన్,ఆగస్ట్5( వెలుతురు):**

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మెరుపు వరదలు సృష్టించిన బీభత్సంతో ధరాలీ గ్రామం మరుభూమిని తలపిస్తోంది. ఈ క్రమంలో ఆర్మీని రంగంలోకి దించారు. సహాయకచర్యల్లో వారు వెంటనే దిగిపౌరులను రక్షించే పనిలో పడ్డారు. ఇకపోతే భారీ ఎత్తున బురద వరద ధరాలీని కప్పేసింది. దీనికి సంబంధించి వెలుగులోకి వచ్చిన ఒక వీడియో హృదయాలను కలచివేస్తోంది. దూసుకొస్తున్న జలప్రవాహాన్ని తప్పించుకునేందుకు.. సహాయం కోసం ఆర్తనాదాలు చేసుకుంటూ కొందరు పరుగులు తీసిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ప్రకృతి విలయం వారితో సహా అన్నింటిని జలసమాధి చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సహాయ చర్యలు చేపడుతున్నాయి. పర్వత సానువుల్లో ఉన్న ధరాలీ గ్రామంపై ఒక్కసారిగా జల ప్రవాహం విరుచుకుపడటంతో ఊరంతా అతలాకుతలమైంది. హోటళ్లు, నివాస భవనాలు కొట్టుకుపోయాయి. ఇప్పటివరకు



నలుగురు మృతి చెందినట్లు- అధికారులు చెబుతున్నప్పటికీ.. ఆ సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు- సమాచారం. ఘటన తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. 150 మంది సైనికులను ఘటనాస్థలానికి పంపినట్లు- ఆర్మీ తన అధికారిక 'ఎక్స్'లో పేర్కొంది. హర్షిల్‌లోని ఆర్మీ క్యాంప్‌నకు దాదాపు 4 కి.మీ దూరంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపింది. సమాచారం తెలుసుకున్న 10 నిమిషాల వ్యవధిలోనే సైన్యం అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు- ఎక్స్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని.. ఇప్పటి వరకు 20 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు- తెలిపింది. వారందర్నీ హర్షిల్‌లోని ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు- తెలిపింది. మరోవైపు స్థానిక పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గ్రామం మొత్తం బురద నీటితో నిండిపోవడంతో సహాయక చర్యలకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. మీటర్ల మేర పేరుకుపోయిన బురదను తొలగించి.. బాధితులను బయటకు తీసుకురావడం కత్తిమీద సాములా మారింది. మరోవైపు ఆకస్మిక వరదలకు గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన కుంభవృష్టి కారణంగానే ఒక్కసారిగా వరద ప్రవాహం ముంచుకొచ్చినట్లు- ప్రాథమిక అంచనాకు వచ్చారు. ధరాలీ ఘటన జరిగిన కొద్దిసేపటికే ఉత్తరకాశీలోని సుఖీ టోప్‌లోనూ మెరుపు వరదలు సంభవించాయి. దీంతో పలు ఇళ్లకు తీవ్ర నష్టం వాటిల్లగా.. మరికొన్ని కొట్టు-కుపోయాయి. ఈ విపత్తులపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# బీసీ రిజర్వేషన్స్ ఢిల్లీలో యుద్ధం చేద్దాం

ఇక బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశం మా నాయకుడు రాహుల్ గాంధీ కల. ఎంత జనాభాకు అంత వాటా (జితనీ ఆబాదీ. ఉతనీ హిస్సేదారీ) ఉండాలని కాంగ్రెస్ పార్టీ బలంగా కోరుకుంటోంది. ఇది రాహుల్ గాంధీ ఆశ, ఆకాంక్ష. ఆయన దేశమంతా భారత్ జోడో యాత్ర చేసినప్పుడు కులగణన చేస్తామని హామీనిచ్చారు. ఆయన ఆశయం మేరకు తెలంగాణలో ఏర్పడ్డ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కులగణన చేసి చూపించింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిరంజన్ ఛైర్మన్‌గా బీసీ కమిషన్‌ను నియమించుకున్నం. కులగణన సర్వే కోసం ప్రత్యేక కమిషన్ (డెడికేటెడ్ కమిషన్) ను నియమించింది. విజయవంతంగా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే పూర్తి చేసింది ప్రభుత్వం. దాని ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు, విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు బిల్లులను శాసనసభలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తే వాటిని ఆమోదించకపోవడం దారుణం. ఈ బీసీ కుల సర్వే కోసం సుమారు లక్ష మంది దాదాపు 50 రోజుల పాటు ఇంటింటికి తిరిగి సమగ్రంగా సమాచారం సేకరించారు. సర్వేను ఫెయిల్ చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్, కేటీఆర్ అండ్ టీం క్యాస్ట్ సర్వేలో పాల్గొనలేదు. సర్వే జరుగుతున్నప్పుడు విషం చిమ్మారు. బీసీలకు న్యాయం జరగడమే వాళ్ళకు ఇష్టం లేనట్టు ప్రవర్తించారు. ఈ పరిణామాలన్నీ యావత్ రాష్ట్రమంతా గమనించింది. బీసీ కుల సర్వే జరిగి బిల్లులు అసెంబ్లీలో పెట్టిన తర్వాత ఆ లెక్కలు బయటకు వస్తుండడంతో తమ రాజకీయ పీఠాలు కదిలిపోతున్నాయనే భయం కేసీఆర్ కుటుంబ సభ్యుల్లో నెలకొంది. అందుకే, బీసీ రిజర్వేషన్లకు మద్ధతు ఇచ్చారు. ఆఖరికి బీజేపీ పార్టీ కూడా అసెంబ్లీలో బిల్లు పెట్టిన సందర్భంగా మద్ధతు ఇచ్చారు. ఇప్పుడు మాత్రం ఇటు బీఆర్ఎస్ మౌనం వహిస్తున్నది. బీజేపీ ముస్లింలను తీసివేస్తే బిల్లు మద్ధతు ఇస్తామంటూ కొత్త రాగం ఎత్తుకోవడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. అదే సమయంలో మేము బీజేపీ వాళ్లను అడుగుతున్నం నిలదీస్తున్నం. ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, వాళ్ళ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ ఉన్న మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. మరి అక్కడ కూడా అమలు చేస్తున్న ముస్లిం రిజర్వేషన్లను తొలగించాలని తెలంగాణ బీజేపీ నాయకులు ఆ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేయగలరా అని సూటిగా ప్రశ్నిస్తున్నం.



> *బీసీ అధ్యక్షుడిగా ఉన్న బీసీ బిడ్డ బండి సంజయ్‌ను అకస్మాత్తుగా తీసివేసి ఆయన ప్రెసిడెంట్ పోస్టు నుంచి తొలగిస్తున్నప్పుడు కూడా ఎటువంటి కారణం చెప్పకుండా పక్కనబెట్టి ఒక ఓసీ వ్యక్తిని అధ్యక్షుడు ఇచ్చిన చరిత్ర ఆ పార్టీది. అటువంటి వాళ్ళు బీసీల సాధికారిత గురించి మాట్లాడుతారని మేము అనుకోవడం లేదు. అసలే ఆశించడం లేదు. అయితే, ఈ రెండు పార్టీలు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి ఇప్పుడు వ్యతిరేక వైఖరి అవలంభించడాన్ని మేము తీవ్రంగా తప్పుబడుతున్నం.*



బీసీ బిల్లుపై బీజేపీకి గల్లీలో ఓకే. ఢిల్లీలో నాట్ ఓకే అంటే కుదరదన్న విషయ బీజేపీ, బీఆర్ఎస్‌లు గుర్తించాలి. ఇదివరకు చెప్పినట్టు మాది బీసీల సంక్షేమం కోరే పార్టీ. కాంగ్రెస్‌లో బీసీలు రాష్ట్ర, జాతీయ పార్టీ అధ్యక్షులయ్యారు. అనేక రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులయ్యారు. భవిష్యత్తులోనూ అవుతారు. బీజేపీ, బీఆర్ఎస్‌లో ఎప్పటికైనా ఒక బీసీ అధ్యక్షుడు కాగలరా పదేళ్ల పాటు బీసీలను విస్మరించిన బీఆర్ఎస్ నాయకులు శాసనసభ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీసీ బంధును తెరపైకి తెచ్చి బీసీలను మోసం చేసే ప్రయత్నం చేశారు. కానీ, ఎవరూ నమ్మలేదు. బీఆర్ఎస్ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకత. బీసీలపై ద్వేషం ఉంది. బీసీ నేత నరేంద్రను అవమానకరంగా పార్టీ నుంచి పంపించి వేశారు. ఆ తర్వాత విజయశాంతిని అలానే చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీలో ఉన్న ఈటల రాజేందర్‌ను ఎక్కడా తమ పీఠానికి ముప్పు అవుతారోననే భావనతో అవమానకరంగా పార్టీ నుంచి బయటికి పంపించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావానికి తన నివాసం జలదృశ్యాన్ని ఇచ్చిన కొండా లక్ష్మణ్ బాపూజీ మరణిస్తే కనీసం నివాళులర్పించేందుకు కేసీఆర్ వెళ్లలేదు. గొర్రెల పంపిణీ పేరుతో గొల్ల కురుమలను, చేపల పేరుతో గంగపుత్రులు, ముదిరాజ్‌లను, చేనేత వర్గాలను మోసం చేసిన నీచ చరిత్ర బీఆర్ఎస్‌ది. బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే కేసీఆర్ కుటుంబం చూసింది. తాత్కాలిక తాయిలాలు ఎరగా వేసి మోసం చేశారు. కాంగ్రెస్ హయాంలో బీసీ సబ్ ప్లాన్ ఉండగా బీఆర్ఎస్ హయాంలో దానిని ఎత్తివేశారు. గత పదేళ్లో బీసీ సంక్షేమానికి రూ.లక్ష కోట్లు కేటాయించినట్లు చూపించి అందులో చారాణా వంతు నిధులు ఖర్చు పెట్టలేదు. ఎంబీసీ కార్పొరేషన్ ను ఏర్పాటు చేశామంటూ హడావుడి చేసి రూపాయి కూడా ఇవ్వలేదు. బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారు. కార్పొరేషన్ల ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేదు. రుణాలు ఇస్తామంటూ రెండు సార్లు బీసీల నుంచి దరఖాస్తులు స్వీకరించి రూపాయి కూడా ఇవ్వలేదు. బీసీలపై బీఆర్ఎస్ నేతలకు నిజంగా ప్రేమ ఉంటే సమగ్ర కుటుంబ సర్వేలో కులాల సమాచారం సేకరించి కూడా ఎందుకు బయటపెట్టలేదు. ఆ సర్వే సమాచారాన్ని కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు తమ రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకున్నారే తప్ప బీసీల అభ్యున్నతి కోసం ఉపయోగించలేదు. నిజంగా కేసీఆర్‌కు బీసీలపై ప్రేమ ఉంటే తన హయాంలో సేకరించిన సమాచారాన్ని బయటపెట్టి.. బీసీల అభ్యున్నతికి వినియోగించేవాడు, అవేం లేవు కాబట్టే సర్వే తన ఇంటిలో దాచుకున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించాం. గౌడన్నల రక్షణ కోసం కాటమయ్య రక్షణ కవచాలను (కిట్) అందించాం. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే అందించే పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత యాదవ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడు అనిల్ కుమార్‌కు రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చింది. గతంలోనూ చేనేత వర్గానికి చెందిన సామాన్య కార్యకర్త రాపోలు ఆనంద భాస్కర్‌ను కాంగ్రెస్ రాజ్యసభకు పంపింది. నా శాఖ పరిధిలోని వనమహోత్సవం కార్యక్రమంలో ఈత, తాటి మొక్కలు పెంచి గౌడ, ఇతర బీసీ సామాజికవర్గాలకు ఉపయోగపడే విధంగా కృషి చేస్తున్నం. బీసీల అభ్యున్నతి, బీసీ సాధికారిత కాంగ్రెస్‌తోనే సాధ్యం. చరిత్ర చెబుతున్నది ఈ సత్యం.. వర్తమానం కూడా అదే సత్యాన్ని చెబుతున్నది. ఈ విషయం ప్రత బీసీ బిడ్డ గమనించి ఈ బీసీ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి అండగానికి నిలవాలని మనసారా కోరుతున్న.



**కొండా సురేఖ,**
**రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి.**

# శ్రీచైతన్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

## అంబరాన్ని అంటిన ఫ్రెషర్స్ డే సంబరాలు












**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 05:** స్థానిక శ్రీచైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు, రెండవ సంవత్సర విద్యార్థులు ఘనంగా ఆటపాటలతో స్వాగతం పలికారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ మరియు భాద్యతయుతమైన చదువు విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును ప్రసాదిస్తుందని తేలియజేశారు. కావున విద్యార్థినీ విద్యార్థులు రాబోయే పోటీ ప్రపంచానికి అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకొని అటు తల్లిదండ్రులకు ఇటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. నాణ్యమైన కార్పోరేట్ స్థాయి విద్యను ఉత్తర తెలంగాణ ప్రాంత విద్యార్థులకు అందించాలనే ఉ ద్దేశ్యంతో శ్రీచైతన్య విద్యాసంస్థలు నడుస్తున్నాయని తెలిపారు. శ్రీచైతన్య గ్రూఫ్ అఫ్ జూనియర్ కళాశాలలు స్థాపించిన నాటి నుండి రాష్ట్ర స్థాయి ర్యాంకులకు కేరాఫ్గా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వాతావరణంలో విద్యార్థుల విద్యార్థ బంగారు భవిష్యత్ కు బాటలు వేస్తున్నామని తెలిపారు. పటిష్టమైన ప్రణాళికలతో పాటు నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల అత్యుత్తమ బోధన విద్యార్థులు పట్టుదలతో సాధించాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాలల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, డీన్ జగన్ మోహన్ రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మల్లారెడ్డి, రాధాక్రిష్ణ, మోహన్రావు, ఎజియం శ్రీనివాస్ అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.





















# ఉస్తాద్‌లోపవన్ షెడ్యూల్ పూర్తి

## - దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్‌కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు– తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు. ఇటీవలే 'హరిహర వీరమల్లు'తో పలకరించిన పవన్‌కల్యాణ్ అదే జోష్‌తో ఇప్పుడు 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను పూర్తి చేశారు. ఆయన సపోర్ట్ వల్లే ఈ షెడ్యూల్ త్వరగా పూర్తయినట్లు– హరీశ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌పై ప్రశంసలు కురిపించారు. మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడడం.. మీరు పక్కనుంటే కరెంట్ పాకినట్లే అంటూ ఆయనతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఈ రోజును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని దర్శకుడు తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకు మరింత పవర్‌ను ఇచ్చిందన్నారు. సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం హరీశ్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో పవన్ సింపుల్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు షేర్ చేస్తున్నారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ – హరీశ్‌శంకర్) కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టు–కున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. దేవీశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ 'ఓజీ'లో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఇది రానుంది.





# విశ్వంభరలో ఆషిక రంగనాథ్ పోస్టర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ 'విశ్వంభర'. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ ట్రీట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పోస్టర్ అదిరిపోయింది, ఆషిక కళ్ళలో మ్యాజిక్ ఉంది, విశ్వంభరకు మరో హైలైట్ ఆమె అవుతుందని ఫిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాన్ని, క్యారెక్టర్ డెప్త్‌ను హైలైట్ చేస్తోంది. చిరు సరసన త్రిషతో పాటు–, సెకండ్ హీరోయిన్ ఈ కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటిస్తోంది. ఈ సినిమాను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్న యూవీ క్రియేషన్స్, ప్రమోషనల్ స్ట్రాటజీలో కూడా కొత్తదనం చూపించబోతున్నారు. బర్త్ డే పోస్టర్‌తో మొదలైన ఈ ప్రమోషన్ రన్ ఇక నుంచి రెగ్యులర్‌గా సాగనుందని సమాచారం. భారీ సెట్‌లు, విజువల్ ఎఫెక్ట్స్, మైథలాజికల్ టచ్‌తో కూడిన ఈ సినిమాను వినాయక చవితి లేదా దసరా సీజన్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అంతే కాదు ఎం.ఎం.కీరవాణి అందిస్తున్న సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, రీసెంట్ గా 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో తన వర్క్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చుకున్న కీరవాణి.. ఇప్పుడు 'విశ్వంభర'కి సంగీతం అందిస్తుండటంతో మ్యూజిక్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# భారత్-చైనా యుద్ధం ఆధారంగా 120 బహదూర్

బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం '120 బహదూర్' . 1962లో జరిగిన భారత్–చైనా యుద్ధం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని రజనీష్ దర్శకత్వం వహిస్తుండగా.. పరమ వీర చక్ర పురస్కార గ్రహీత మేజర్ సైతాన్ సింగ్ భాటి పాత్రలో ఫర్హాన్ అక్తర్ నటించబోతున్నాడు. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రం నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. భాగ్ మిల్కా భాగ్ తర్వాత ఫర్హాన్ అక్తర్ మరోసారి బయోపిక్ చేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.




# పృథ్వీరాజ్‌ను వదిలి షారూఖ్‌కు అవార్డా

## జాతీయ చలనచిత్ర అవార్డులపై విమర్శలు



జాతీయ చలన చిత్ర పురస్కారాల జాబితాలో ఉత్తమ నటుడి ఎంపికపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. 2023లో విడుదలైన సినిమాలకు గాను ఉత్తమ నటుడుగా బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్, ఉత్తమ సపోర్టింగ్ నటుడిగా విజయ రాఘవన్, బెస్ట్ సినిమాగా భగవంత్ కేసరి సినిమాలు అవార్డ్స్ అందుకున్నాయి. అలాగే వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విజేతలుగా ప్రకటించింది నేషనల్ అవార్డ్స్ జ్యూరీ. అయితే ఈ అవార్డ్స్ నేషనల్ జ్యూరీకి తలనొప్పులు తెచ్చింది. 2023 బెస్ట్ యాక్టర్ గా జావాన్ సినిమాకు గాను షారుక్‌కు ఈ అవార్డు ప్రకటించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదే ఏడాదిలో మళయాళంలో పృధ్వి రాజ్ సుకుమారన్ హీరోగా ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో పృధ్వి రాజ్ నటనకు అవార్డు దక్కకపోవడంతో జ్యూరీపై విమర్శలు వచ్చాయి. వాస్తవంగా చూస్తే ఆడుజీవితంలో పృద్వి రాజ్ సుకుమారన్ నటన అద్భుతంగా ఉంటుంది. బ్రతుకు తెరువుకు దుబాయ్ వెళ్లిన ఓ సామాన్యుడు అక్కడ ఎడారిలో అనుభవించిన నరకం అనుభవించే క్యారక్టర్ లో పృద్వి రాజ్ అద్భుతంగా నటించాడు. ఇక జవాన్ సినిమాలో షారుక్ నటన గొప్పగా ఏమి ఉండదు. ఓ రొటీన్ రెగ్యులర్ కమర్షియాల్ సినిమాలో ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఈ విషయమై నేషనల్ జ్యూరీని ప్రశించగా జ్యూరీ సభ్యుడు ప్రదీప్ నాయర్ స్పందించారు. ఆడు జీవితంలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటన ఆర్టిఫిషయల్ గా ఉంటుంది. సహజత్వ లేదని జ్యూరీ చైర్‌పర్సన్ అశుతోష్ గోవారికర్ తో పాటు సహా జ్యూరీ సభ్యులు పలువురు భావించడంతో పృథ్వీరాజ్ కు అవార్డు దక్కలేదని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్స్ ఫైర్ అవుతున్నారు. స్వప్రయోజనాల ముందు ఎంతటి అద్భుతమైన నటన కనబరించిన ఇలానే ఉంటుందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# సినిమా ఫెయిల్యూర్‌కు రివ్యూలు కూడా ఓ కారణం

## - హీరోయిన్ మృణాల్ ఠాకూర్

ఏదైనా ఒక సినిమా వచ్చిందంటే చాలు.. యూట్యూబ్ రివ్యూల, ట్విట్టర్ కామెంట్స్, ఇన్‌స్టా రీల్స్‌తో మైండ్ బ్లాక్ అంటూ ఇష్టం వచ్చిన రివ్యూ ఇస్తున్నారు. అసలు సినిమా ఎలా ఉందో తెలిసేలోపే.. 'ఫ్లాప్', 'ఓవరాక్టింగ్', 'బోర్' అంటూ ట్యాగ్‌లతో దండం పెట్టి ప్రేక్షకుల అభిప్రాయాలను దారి తప్పిస్తున్నారు ఈ ట్రెండ్‌పై ఇప్పటికే పలువురు హీరోలు, నిర్మాతలు నిప్పులు చెరిగారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ– మృణాల్ ఠాకూర్ కూడా ఇదే విషయంపై స్పందించింది. ఇటీవల బాలీవుడ్ లో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' విడుదలైన మిశ్రమ స్పందన అందుకుంది. ఈ క్రమంలో మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఓ అభిమాని.. నేను నెగిటివ్ రివ్యూలు చూసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమా చూడలేదు అంటూ కామెంట్ చేశాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. చాలా రివ్యూలు తప్పుదారి పట్టించేవిగా ఉంటున్నాయి. అందుకే రివ్యూలను నమ్మకుండా, మీరే సినిమా చూసి ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఒక్కోసారి సినిమా ఫెయిల్యూర్‌కి రివ్యూలే కారణం అవుతాయి అంటూ కుండ బద్దలు కొట్టేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రివ్యూలు చూసి ప్రేక్షకులు సినిమాకు వస్తే.. అసలు సినిమా ఆత్మను చూడకముందే దాన్ని ఖండించేసినట్లే అవుతుందని ఇండస్ట్రీలో చాలామంది నిపుణులు కూడా చెబుతున్నారు. అయిన కూడా వారి ఆగడాలు ఆగడం లేదు. ఇక ప్రజంట్ మృణాల్ వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్నారు.



# మృణాల్ ప్రేమలో ధనుష్

## చక్కర్లు కొడుతున్న రూమర్స్



కోలీవుడ్ స్టార్ ధనుష్ ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంలోనూ మీడియా దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇటీవలే ఆయన 'కుబేర' మూవీతో విజయం అందుకున్నాడు. ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న ఇడ్లీ కడై మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడు. హీరోగా మాత్రమే కాకుండా, దర్శకుడు, నిర్మాత, సింగర్‌గాను పేరు తెచ్చుకున్న ధనుష్ గురించి ఎప్పుడూ ఏదో ఒక రూమర్ నెట్టింట హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. కొద్ది రోజుల క్రితం ధనుష్ సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో 18 ఏళ్ల పెళ్లి జీవితానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ధనుష్ పేరుతో పలు కథనాలు వెలువడుతున్నాయి. ఒకప్పుడు మీనాతో పెళ్లి వార్తలూ అని చక్కర్లు కొట్టాయి. అయితే మీనా వాటిని ఖండిస్తూ, అలాంటి సంబంధమే లేదు, మా పాపను బాధించకండి అంటూ స్పందించారు. ఇప్పుడు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్‌తో ధనుష్ ప్రేమలో ఉన్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. మృణాల్ పుట్టినరోజు వేడుకలో ధనుష్ ఆమెతో సన్నిహితంగా కనిపించడంపై, వీరిద్దరి మధ్య స్పెషల్ బాండ్ ఉందని టాక్ స్పీడ్‌గా స్ప్రెడ్ అయింది. చేతులు పట్టుకుని మాట్లాడుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో లవ్ గాసిప్‌కు బలం చేకూరింది. ఇక మృణాల్ బర్త్ డే రోజే ధనుష్ ముంబైకి ప్రత్యేకంగా విమానంలో వెళ్లడం, మృణాల్, అజయ్ దేవగన్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' స్పెషల్ స్క్రీనింగ్‌కు హాజరవ్వడం ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. ధనుష్, మృణాల్ గతంలోను జంటగా కనిపించారు. జూలై 3న, రచయిత్రి–నిర్మాత కనికా ధిల్లన్ ధనుష్ తదుపరి చిత్రం 'తేరే ఇష్క్ మే' కోసం ఏర్పాటు– చేసిన పార్టీలో మృణాల్ సందడి చేసింది. కనికా షేర్ చేసిన ఫొటోల్లో మృణాల్, ధనుష్ సినిమా యూనిట్ తో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఫోటోలకు ఫోజులివ్వడంతో అప్పటి నుండే వీరిద్దరు డేటింగ్ చేస్తున్నారన్న రూమర్స్ గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ధనుష్ కానీ, మృణాల్ కానీ ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం వీరిద్దరిపై రకరకాల కామెంట్లు– కొనసాగుతున్నాయి.

# నేడు ఎపి కేబినేట్ సమావేశం

**- ఉచిత బస్సు పథకంపై చర్చ**



**అమరావతి,ఆగస్టు 5( వెలుతురు):**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం జరగనుంది.. సచివాలయంలో జరిగిన ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలపనుంది.. ముఖ్యంగా.. ఎంతోకాలంగా ఎదురుచూస్తోన్న మహిళలకు ప్రభుత్వం శుభవార్త చెప్పబోతోంది.. కేబినెట్ సమావేశంలో మహిళల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై చర్చించబోతున్నారు.. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి అధికారికంగా పేరు ఖరారు చేసి ప్రకటన చేయనుంది ప్రభుత్వం.. పలు సంస్థలకు భూ కేటాయింపులపై కూడా చర్చించనున్నారు.. నాలా చట్ట సవరణకు సంబంధించి కేబినెట్ లో చర్చిస్తారు.. ఎల్ఆర్ఎస్.. బీఆర్ఎస్ పై కూడా కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉంది.. సీఎం అండ్ టీం సింగపూర్ టూర్ పై చర్చించనుంది మంత్రివర్గం.. ఇక, కేబినెట్ సమావేశం తర్వాత తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించనున్నారు.. లిక్కర్ కేసులు.. నగదు బయట పడడం.. అరెస్ట్ లకు సంబంధించి కూడా చర్చించనున్నారు.. కాగా, స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని మహిళలందరికి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు సిద్ధమైంది కూటమి ప్రభుత్వం.. దీనిపై ఇప్పటికే అధికారులు ఎ-కై-÷-సజ్ పూర్తి చేశారు.. అంతర్రాష్ట్ర పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడి-కై-నా మహిళలు జీరో టికెట్‌తో ఉచితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకుంటు-న్నారు.. మహిళా ఉద్యోగులు, ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం కల్పించబోతున్నారు.. మొత్తం బస్సుల్లో 74 శాతం బస్సులున్న పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ- ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని ఇప్పటికే రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించినా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుంది.

# బిసి రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఆందోళన

**- నేడు జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా**

**- గురువారం రాష్ట్రపతిని కలసి వినతిపత్రం సమర్పణ**

**- మంత్రి వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్ వెల్లడి**



**న్యూఢిల్లీ,ఆగస్టు 5( వెలుతురు):**
పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే లోక్‌సభలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. మరోవైపు.. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి భారీగా చేరుకుంటున్నారు. ఇప్పటికే ఢిల్లీకి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ కీలక నేతలు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవద్దని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని డిమాండ్ చేశారు. ఇప్పటికే ముసాయిదాని రాష్ట్రపతికి పంపించామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. 50శాతం పరిమితిని ఎత్తివేయాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కార్యచరణ రూపొందించారని చెప్పుకొచ్చారు. బుధవారం జంతర్ మంతర్ వద్ద దాదాపు 20,000 వేల మందితో ఆందోళన నిర్వహిస్తున్నామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్‌కు చిత్తశు ద్ధి ఉందని ఉద్ఘాటించారు. మైనార్టీలను అడ్డుగా చూపుతూ బీసీలకు రిజర్వేషన్లు అడ్డుకోవడం సరికాదని మంత్రి వాకిటి శ్రీహరి హితవు పలికారు. బీజేపీ ఎమ్మెల్యేలు తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు సపోర్టు చేశారని.. ఢిల్లీలో ఎందుకు మిన్నకుండిపోయారని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో కాకుండా ఢిల్లీలో ధర్నా చేయాలని సూచించారు. అసలు బీసీ రిజర్వేషన్ విషయంలో కవితకు ఏం సంబంధమని నిలదీశారు. కల్వకుంట్ల కుటుంబంలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదని విమర్శించారు. పార్లమెంట్‌లో ఎంపీల వాయిదా తీర్మానాలు, ధర్నా, గురువారం రాష్ట్రపతిని కలుస్తామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# కాశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపు

**- కుప్వారాలో ఉగ్రస్థావరం గుర్తింపు**

**- భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం**

**శ్రీనగర్,ఆగస్ట్5( వెలుతురు):**
జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు ముమ్మరంగా ఆపరేషన్లు చేపడుతున్నాయి. తాజాగా కుప్వారాలో ప్రాంతంలో ఉగ్ర స్థావరాన్ని గుర్తించారు. దీనిలో పెద్దసంఖ్యలో ఆయుధాలు ఉన్నాయి. ఈ ఆపరేషన్‌కు నాగ్ని టాప్ అని పేరుపెట్టారు. పక్కా సమాచారం మేరకు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, బీఎస్‌ఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. ఇక్కడ ఒక తుపాకీ, 12 గ్రనేడ్లు, రెండు మ్యాగ్జైన్‌లు, ఇతర పేలుడు పదర్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే కుల్గాంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆపరేషన్ అఖాల్‌లో ఇప్పటివరకు ముగ్గురు ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టిన విషయం తెలిసిందే. మంగళవారం ఐదో రోజు కూడా ఇది కొనసాగుతోంది. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో పహల్గాం నరమేధానికి పాల్పడిన ఉగ్రమూకను మట్టు-పెట్టిన కొన్ని రోజుల్లోనే ఈ సైనిక చర్యలు చోటు-చేసుకోవడం గమనార్హం. జులై 30వ తేదీన ఆపరేషన్ శివ్‌శక్తిలో ఇద్దరు చొరబాటు- దారులను భద్రతా దళాలు హతమార్చాయి. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ ఆయుధ డంప్ దొరకడం గమనార్హం.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

**- తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ**



**న్యూఢిల్లీ,ఆగస్టు 5( వెలుతురు):**
ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఉదయం, ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ఎగువ సభలో ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు కింద అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బీరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద అమలులోకి వచ్చే ఈ నిర్ణయం ప్రకారం.. రాష్ట్రపతి పాలన పొడగించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన భారత గెజిట్‌లో ప్రచురించబడిన ఈ ప్రకటన, మణిపూర్ శాసనసభ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపి వేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రకారం, గవర్నర్ అధికారాలను ఇప్పుడు రాష్ట్రపతి ఉపయోగిస్తారు. రాష్ట్ర శాసనసభ అధికారాన్ని పార్లమెంటు- స్వీకరిస్తుంది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయలేనప్పుడు సాధారణంగా రాష్ట్రపతి పాలన విధిస్తారు. రాష్ట్రపతి పాలన విధించడం పార్లమెంటరీ ఆమోదానికి లోబడి ఆరు నెలల వరకు ఉంటుంది. ఈ కాలంలో, కేంద్ర ప్రభుత్వం పాలనను పర్యవేక్షిస్తుంది. కొత్త అసెంబ్లీని ఎన్నుకోవడానికి కొత్తగా ఎన్నికలు జరగవచ్చు. మణిపూర్‌లో జరిగిన అశాంతిలో ప్రధానంగా మెజారిటీ- మెయిటీ- కమ్యూనిటీ-, మైనారిటీ- కుకి-జోమి తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ కోటాలు ఇంకా భూమి హక్కులకు సంబంధించిన వివాదాలపై ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ హింస వందలాది మంది మరణానికి దారితీసింది. సుమారు 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో అక్కడ శాంతిభద్రతలను కాపాడేందుకు కేంద్రం రాష్ట్రపతి పాలనకు మొగ్గుచూపింది.

# గువ్వలా ఎగిరిపోతున్న బాలరాజు

**- కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లుచర్చ**



**మహబూబ్‌నగర్,ఆగస్టు5 ( వెలుతురు):**
ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేయడం వెనక ఏమై ఉంటుందా అని అంతా చర్చిస్తున్నారు. ఇప్పుడే బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదు. అయితే ఆయన అధికార కాంగ్రెస్‌లోకి వెళతారన్న ప్రచారం కూడా ఉంది. ఇకపోతే బీఆర్ఎస్ పార్టీపై అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత చెప్పినట్లుగానే పరిణామాలు ఉంటున్నాయని అన్నారు. బీఆర్ఎస్‌లో పరిణామాలు చూస్తుంటే పొత్తు పెట్టు-కున్నా ఆశ్చర్యం లేదని ఆక్షేపించారు. బీఆర్ఎస్, బీజేపీ వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత లాంటి నేతలు కూడా చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో తనకు భవిష్యత్తు లేదనే అసంతృప్తితోనే రాజీనామా చేశానని చెప్పుకొచ్చారు. మంగళవారం గువ్వల బాలరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నేతలు తనకు టచ్‌లోకి వచ్చిన మాట వాస్తవమని గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గం ప్రజల అభిప్రాయం మేరకు ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకుంటా నని తెలిపారు. బీఎల్ సంతోష్‌ను తాను ఎప్పుడూ విమర్శించలేదని చెప్పుకొచ్చారు. అప్పట్లో బీఎల్ సంతోష్ ఎవరో కూడా తనకు తెలియదని గువ్వల బాలరాజు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన టాస్క్‌ను మాత్రమే తాను పూర్తి చేశానని క్లారిటీ- ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకత్వం.. ప్రజల్లో బలం లేని రెడీమేడ్ లీడర్స్‌ను నమ్ముకుంటుందని వ్యాఖ్యానించారు. జనరల్ నియోజకవర్గాల్లో దళితులకు సీట్లు ఇచ్చే దమ్ము బీఆర్ఎస్‌కు ఉందా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏడాదిన్నర కాలంగా బీఆర్ఎస్‌లో తనకు ప్రాధాన్యం తగ్గించారని గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గువ్వల బాలరాజు బీఆర్ఎస్ కార్యకర్తతో మాట్లాడినట్లుగా ఓ ఫోన్ కాల్ వైరల్ అవుతోంది. ఈ ఫోన్ కాల్‌లో ఏం మాట్లాడరంటే.. 'బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని లేదా విలీనం అవుతుందనే వార్తలు వస్తున్నాయి. అలాంటప్పుడు మన అభ్యర్థిత్వం ఎగిరిపోతుంది. గతంలో బీజేపీతో నేను పోరాటం చేశా. బీఆర్ఎస్ కంటే ముందే నా దారి నేను చూసుకుని.. బీజేపీలో కలవడం మంచిదని నిర్ణయం తీసుకున్నా. పార్టీలో నన్ను కాదని నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఇచ్చారు. ఆ విషయం ఎంతో బాధించిందని గువ్వల బాలరాజు మాట్లాడుతు న్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనినిబట్టి ఆయన కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని అంటున్నారు. ఇకపోతే జిల్లాకు చెందిన సిఎంగా రేవంత్ ఉండడంతో ఆయన అటువైపు మొగ్గ చూపుతున్నారని కూడా ప్రచారం. మొత్తంగా ఎటు వెళ్లినా ఇప్పటికిప్పుడు గువ్వలకు వచ్చే ఉపయోగం ఏమీ ఉండకపోవ్చు.

# ఢిల్లీలో టెస్లా రెండో అడుగు

**- ముంబై తరవాత ప్రారంభానికి సిద్ధం**

**- 11న షోరూమ్ ప్రారంభానికి నిర్ణయం**




**న్యూఢిల్లీ,ఆగస్టు5 ( వెలుతురు):**
ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి ఇప్పటికే అడుగుపెట్టింది. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీలో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీలో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది. ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు- తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది . రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. అయితే టెస్లాపై మోజుతో ఇండియాలో మార్కెట్ పెరుగుతందని భావిస్తున్నారు.

# కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత



**న్యూఢిల్లీ,ఆగస్టు5 ( వెలుతురు):**
జమ్మూకశ్మీర్ (మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందినట్లు-సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల ఆయన నివాసాల్లో సోదాలు జరిపి, సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అస్వస్థతకు గురైన సత్యపాల్ మాలిక్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఆగస్టు 23, 2018 నుంచి అక్టోబర్ 30, 2019 వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్ పనిచేశారు. ఆ సమయంలో ఓ పవర్ ప్రాజెక్ట్ టెండర్ల పక్రియలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసులో తాజాగా ఆయన నివాసాల్లో సోదాలు జరిపిన సీబీఐ.. ఆయనతోపాటు మరో ఐదుగురి పేర్లను ఛార్జిషీటులో పేర్కొంది. దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన.. ప్రస్తుతం తాను ఆసుపత్రిలో ఉన్నానని, ఎవరితో మాట్లాడే పరిస్థితిలో లేనన్నారు. అనేకమంది శ్రేయోభిలాషుల నుంచి ఫోన్లు వస్తున్నాయని, వాళ్లతో మాట్లా డలేకపోతున్నానని పేర్కొన్నారు.

# కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్

**- లీకులు ఇచ్చి వార్తలు రాయించుకుంటున్నారు**

**- అసెంబ్లీలో చర్చ పెడితే ఎండగడతాం: కెటిఆర్**

**న్యూఢిల్లీ,ఆగస్ట్5( వెలుతురు):**
కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్ మాత్రమే తప్ప అందులో ఏమీ లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. 650 పేజీల పూర్తి నివేదిక ఎవరూ చదవక ముందే అడ్డమైన రోత వార్తలను రెండు పత్రికలు రాస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 655 పేజీల కమిషన్ నివేదికను 60 పేజీలకు కుదించడంలోనే కాంగ్రెస్ భాగోతం అర్థమైందని విమర్శించారు. 600 పేజీల్లో వారికి ఇష్టమైనవి లేవు అని, ఆ 60 పేజీల్లో మాత్రమే వారికి ఇష్టమైనవి ఉన్నాయని, అందుకే వాటిని మాత్రమే బయటపెడుతున్నారని ఆరోపించారు. ఢిల్లీలో భారత ఎన్నికల కమిషన్ నిర్వహించిన సమావేశానికి కెటిఆర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం హాజరైంది. ఈ సమావేశంలో కెటిఆర్‌తో పాటు- రాజ్యసభ సభ్యులు కె.ఆర్ సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్ పాల్గొన్నారు. అనంతరం ఢిల్లీలో కెటిఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం నివేదికపై ప్రశ్నకు సమాధాన ఇస్తూ.. సాయంత్రం కమిషన్ రిపోర్ట్ వస్తే అర్ధరాత్రి ఆస్థాన మీడియాకు లీకులు ఇచ్చారని, తెల్లారి అబద్ధాలను ప్రచారంలో పెట్టారని మండిపడ్డారు. దమ్ముంటే మొత్తం 655 పేజీల నివేదికను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా కెసిఆర్‌పై, బిఆర్ఎస్‌పై కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుందని, అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా తమను అసెంబ్లీలో



మాట్లాడనిస్తే ప్రభుత్వంతో ఫుట్‌బాల్ ఆడుకుంటామని అన్నారు. అసెంబ్లీలో తమ మైకులు కట్ చేయకుండా తమను మాట్లాడిస్తే ఎవరు నిజం చెబుతున్నారు... ఎవరు అబద్ధం చెపుతున్నారో తెలిసిపోతుందని, కాంగ్రెస్ పార్టీకి దమ్ముందా.. అంటూ కెటిఆర్ సవాల్ విసిరారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com